సంచలన వార్తా పత్రిక
లీడర్
SANCHALANA VAARTHA PATRIKA LEADER
గురువారం • 17 జనవరి 2019 । సంపుటి : 21 సంచిక : 173 । ఎడిటర్ : వి.వి.రమణమూర్తి । 8 పేజీలు । వెల : రూ. 2.00
Published from Visakhapatnam, Rajahmundry and Hyderabad

Read / Share / Follow
www.leaderepaper.com
www.facebook.com/leaderramanamurthy/
www.twitter.com/leaderramanamurthy/





ఫుల్ జోష్

- మాంసం.. మద్యం కోసం రూ.20 కోట్లు
- రూ. 10 కోట్ల మందు తాగేశారు
- రూ. 10 కోట్లకుపైగా మాంసం విక్రయాలు
- కనుమ రోజున మందుబాబులు చిందులు

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : సంక్రాంతి అంటేనే మూడు రోజుల పండుగ. మొదటి రోజులు శాకాహారం.. మూడో రోజు కనుమ పండుగ నాడు మాత్రం ముక్క పడనిదే సంక్రాంతి పండుగ పరిపూర్ణం కాదు. ఇది అనాదిగా వస్తున్న సంప్రదాయం. ఈసారి కనుమ బుధవారం వచ్చింది. ఎక్కువ శాతం ప్రజలు అసలైన కనుమ పండుగ జరుపుకున్నారు. సంక్రాంతి పండుగ సంబరాల్లో మద్యం, మాంసం విక్రయాలు భారీగా జరిగాయి, మద్యం ఏరులై పారైంది.

మటన్, చికెన్ అమ్మకాలకూ ఊపు...



బుధవారం తెల్లవారు నుంచే మాంసాహారుల దుకాణాల ముందు క్యూ కట్టారు. కిలోల కొద్ది చికెన్, మటన్ కొనుగోలు చేశారు. అలాగే ఈ ఏడాది మాంసం విక్రయాలు గణనీయంగా పెరిగాయి. వీటితో పాటు కోడి మాంసం, చేపలు, రొయ్యలు విక్రయాలు బాగానే జరిగాయి. నాటు కోడులు విక్రయాలు పెద్ద సంఖ్యలో జరిగాయి. జీవీఎంసీ పరిధిలోని 1500 చికెన్ దుకాణాల ద్వారా దాదాపు నాలుగున్నర లక్ష కిలోల చికెన్ అమ్ముడైపోయాయి. చికెన్ కిలో స్కిన్‌తో రూ.140 నుంచి రూ.160, స్కిన్‌లెస్ రూ.150 నుంచి రూ.170 ధరను నిర్ణయించినా, చాలా మంది అడ్డగోలుగా పెంచేసి సొమ్ము చేసుకున్నారు. దాదాపు రూ.7కోట్లకు పైగా చికెన్ అమ్మకాలు జరిపారు. మరోవైపు మటన్ అమ్మకాలు బాగానే జరిగాయి. బుధవారం ఒక్క రోజే 50 వేల కిలోలకు పైగా మేకమాంసం విక్రయించినట్టు అంచనా. కిలో మటన్ రూ.680 ధర నిర్ణయించారు. ఈ లెక్కన దాదాపు రూ.3 కోట్ల విలువైన మాంసం

మిగతా 2లో

పందెం మంత్రులు

- అప్పన్న సాక్షిగా సంక్రాంతి సంబరాలలో కోడిపందాలు
- సింహగిరిపై మరో అపచారం
- కోళ్లను తెప్పించి మంత్రులచేత తప్పుచేయించిన ఈవో యూనియన్ నాయకుడు శ్రీహరి రాజు

సింహాచలం, న్యూస్‌లీడర్ : ఏదేవాలయాల లోనైనా సప్త వ్యసనాలు ఉండకూడదని దేవాదాయ చట్టం చెపుతోంది. దేవాలయాలు, వాటి పరిసర ప్రాంతాలలో మద్యం సేవించడం, మాంసంతినడం , వ్యభిచారం చేయడం, జూదంఆడటం, ఇలా మొత్తం యేడు వ్యసనాలలో ఒక్కటి కూడా చేయకూడదని తెలిసినప్పటికీ టీడీపీ కేంద్రమాజీమంత్రి

మిగతా 2లో





హోంమంత్రి ఇలాకాలో జోరుగా జూదపు పందాలు





తర్పుగోదావరిజిల్లా, న్యూస్‌లీడర్ : సంక్రాంతి వేడుక పురస్కరించుకుని సాక్షాత్తూ హెూంమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న తూర్పుగోదావరి జిల్లాలో గుళ్ళాట, కోడిపందాలు ,పేకాటలు జోరుగా సాగుతున్నాయి. ప్రతి గ్రామంలోనూ కోర్టుతీర్పుకు తిలోదకాలిస్తూ, చట్టాన్ని తమచేతుల్లోకి తీసుకుని మంత్రులే పందాల్లో పాల్గొనడం ఆనవాయితీగా మారిపోయింది. గోదావరి జిల్లాల్లో లంక గ్రామాలు అధికంగా

మిగతా 2లో

నర్మదా నదిలో పడవ బోల్తా
ఆరుగురు మృతి



ముంబయి : మహారాష్ట్రలోని నందూర్బార్ జిల్లాలో నర్మదానదిలో ఓ పడవ బోల్తాపడటంతో ఆరుగురు మృతి చెందారు. అందులో ప్రయాణిస్తున్న మరో 36 మందిని స్థానికులు రక్షించి, దగ్గరలోని ఆస్పత్రులకు తర లించారు. మకర సంక్రాంతి సందర్భంగా తమ ఆచారం ప్రకారం పూజల్లో పాల్గొ నేందుకుగానూ ఆ పడవలో దాదాపు 60 మంది ప్రయాణికులు వెళుతుండగా ఈ ఘటన చోటు చేసుకుందని ఓ అధికారి తెలిపారు. సహాయక బృందాలు ఆ ప్రాంతానికి చేరుకున్నాయని చెప్పారు. ఈ ఘటనలో మృతులందరూ ఉత్తర మహారాష్ట్రలోని ఓ గ్రామానికి చెందిన వారని పోలీసులు తెలిపారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని వారు చెప్పారు. సామర్థ్యానికి మించి ఆ పడవలో ప్రయాణికులు ఎక్కినందుకే ఈ ప్రమాదం చోటు

మిగతా 2లో

కెన్యాలో ఉగ్రదాడి
15 మంది మృతి





నైరోబీ : కెన్యా రాజధాని నైరోబీలో జరిగిన ఉగ్రదాడిలో మృతుల సంఖ్య 15కు చేరింది. నైరోబీలోని వెస్ట్‌లాండ్స్ ప్రాంతంలో గల డస్టిట్‌డీ2 భవన సముదాయ ప్రాంగణంలో ఇస్లామిక్ ఉగ్రవాదులు దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ భవనంలో 101 గదుల హోటల్, రెస్టారెంట్, స్థానిక, అంతర్జాతీయ ఆఫీస్ కార్యాలయాలు ఉన్నాయి. అంతర్జాతీయ మీడియా తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక కాలమానం ప్రకారం మంగళ వారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో డస్టిట్‌డీ2 భవన సముదాయంలోకి ముష్కరులు చొర బడ్డారు. పార్కింగ్ ప్రాంతంలో నిలిపి ఉంచిన వాహనాలపైకి

మిగతా 2లో

జగన్‌తో కేటీఆర్ బృందం భేటీ

- ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుపై తెరాస, వైసీపీ చర్చలు

హైదరాబాద్ : ఫెడరల్ ఫ్రంట్‌పై వైకాపా, తెరాస మధ్య చర్చలు ప్రారంభమయ్యాయి. ఫెడరల్ ఫ్రంట్‌తో కలిసి వచ్చే విషయంపై వైకాపాతో చర్చలు జరపాలని తెలంగాణ రాష్ట్రముఖ్యమంత్రి, తెరాస అధినేత కేసీఆర్ నిర్ణయించారు. కేసీఆర్ ఆదేశాల మేరకు తెరాస నేతలు కేటీఆర్, వినోద్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, శ్రావణ్ కుమార్ రెడ్డి తదితరులు బుధవారం లోటస్ పాండ్‌లోని జగన్ నివాసానికి చేరుకుని చర్చలు ప్రారంభించారు. కాంగ్రెస్, భాజపాలకు వ్యతిరేకంగా ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుకు కేసీఆర్ శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఫ్రంట్ ఏర్పాటుపై ఇప్పటికే పశ్చిమ్‌బంగా సీఎం మమతా బెనర్జీ, ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్, యూపీ మాజీ సీఎం అఖిలేశ్‌యాదవ్, డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్‌తో కేసీఆర్ చర్చలు జరిపారు. యూపీఏ, ఎన్డీఏ కూటమిలో లేని జగన్



మిగతా 2లో

సుప్రీం కోర్టులో భాజపాకు ఎదురుదెబ్బ
రథయాత్ర చేపట్టొద్దని ఆదేశం



న్యూదిల్లీ : పశ్చిమ బంగలో భారీ రథ యాత్ర చేపట్టాలనుకొంటోన్న భాజపాకు సుప్రీం కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ యాత్రపై రాష్ట్ర ప్రభుత్వ అభ్యంతరాల దృష్ట్యా ప్రస్తుతానికి యాత్ర చేపట్టొద్దని సుప్రీంకోర్టు భాజపాను ఆదేశించింది. అవసరమైతే మమతా బెనర్జీ ప్రభుత్వం వ్యక్తపర్చిన

మిగతా 2లో

ఫిరాయింపు ఎమ్మెల్సీలపై అనర్హత వేటు

హైదరాబాద్ : తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ముగ్గురు ఎమ్మెల్సీలపై శాసన మండలి ఛైర్మన్ స్వామి గౌడ్ అనరత వేటు వేశారు. టీఆర్ఎస్ నుంచి ఎన్నికై కాంగ్రెస్‌లో చేరిన రాములు నాయక్, భూపతి రెడ్డి, యాదవ్ రెడ్డిలను అనరలుగా ప్రకటించారు. రాజ్యాం గంలోని పదో షెడ్యూల్‌లో పొందుపరిచిన పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం వారిపై వేటు వేసినట్లు మండలి ఛైర్మన్ తెలిపారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ముగ్గురు ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌లోకి ఫిరా యించిన విషయం తెలిసిందే. టీఆర్ఎస్ తరఫున ఎన్నికై కాంగ్రెస్‌లో చేరినందుకు వారి సభ్యత్వాలు రద్దు చేయాలని టీఆర్ఎస్ మండలి ఛైర్మన్‌కు ఫిర్యాదు చేసింది. అనరతకు గురైన యాదవ్ రెడ్డి ఎమ్మెల్యేల కోటాలో మండలికి ఎన్నికైయ్యారు. మరోసభ్యుడు భూపతిరెడ్డి నిజామాబాద్ నుంచి స్థానిక సంస్థల కోటాలో మండలి సభ్యుడిగా ఎన్నికైయ్యారు. గవర్నర్ కోటాలో ఎన్నికైన రాములు



మిగతా 2లో

సంచలన వార్తాపత్రిక
లీడర్
క్లాసిఫైడ్స్

విశాఖపట్నం | గురువారం 17-1-2019

నర్మదా నదిలో పడవ బోల్తా

(మొదటి పేజీ తరువాయి)

చేసుకుని ఉంటుందని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. పడవ ఒడ్డుకు చేరుకుంటున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. మృతుల కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. క్షతగాత్రుల బంధువులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

కెన్యాలో ఉగ్రదాడి

(మొదటి పేజీ తరువాయి)

బాంబులు విసిరారు. అనంతరం ఓ దుండగుడు తనను తాను పేల్చి వేసుకున్నాడు. దాడి అనంతరం తుపాకులతో ముష్కరులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో ఇప్పటివరకు 15 మంది మృతిచెందగా.. పలువురు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. కాగా.. దాడి గురించి తెలియగానే భవన సముదాయాన్ని భద్రతాసిబ్బంది తమ అధీనంలోకి తీసుకున్నారు. ముష్కరులను మట్టుబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం ఇంకా కాల్పులు కొనసాగుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. మరోవైపు అల్‌ఖైదాకు చెందిన అల్ షబాబ్ ఈ దాడికి పాల్పడినట్లు అధికారులు ధ్రువీకరించారు.

సుప్రీం కోర్టులో భాజపాకు ఎదురుదెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

అభ్యంతరాలకు తగ్గట్లుగా ప్రణాళిక మార్చుకొని యాత్ర జరుపుకొనేందుకు, తిరిగి ప్రభుత్వాన్ని అనుమతి కోరవచ్చని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే, పశ్చిమ బంగలో ర్యాలీలు, బహిరంగ సభల్లాంటివి భాజపా ఎక్కడైనా పెట్టు కోవచ్చని సూచించింది. ఒక ప్రజాస్వామ్య దేశంలో ర్యాలీలు, యాత్రలు చేపట్టుకొనే హక్కు తమకు ఉందని భాజపా తరఫు న్యాయవాది కోర్టులో వాదించగా.. యాత్ర ప్రణాళిక మార్చుకుంటే అంగీకరించాలని రాష్ట్ర ప్రభు త్వానికి కోర్టు సూచించింది. గతంలో ఈ అంశంలో కలకత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ భాజపా సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.

భాజపా తలపెట్టిన రథ యాత్రకు తొలి నుంచి తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతి నిరాకరిస్తున్న సంగతి తెలిసిందే. మతం, వర్గ పరంగా సున్నితమైన ప్రాంతాల మీదుగా రథ యాత్ర ప్రణాళిక చేయడంతో, శాంతి భద్రతల సమస్య తలెత్తే అవకాశముందని ప్రభుత్వం చెబుతోంది. రథ యాత్ర చేపడితే ఈ సమస్యలు కచ్చితంగా తలెత్తే అవకాశముందని నిఘా వర్గాలు సైతం చెప్పినట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్రంలోని కూచ్ బెహార్, 24 పరగణాలు, బీర్భుమ్ జిల్లాల గుండా రథ యాత్ర చేపట్టేందుకు భాజపా తొలుత ప్రణాళిక చేసింది.

ఫిరాయింపు ఎమ్మెల్సీలపై అనర్హత వేటు

(మొదటి పేజీ తరువాయి)

నాయక్ కూడా అనర్హతకు గురయ్యారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 191(2) ప్రకారం సభ్యులపై చర్యలు తీసుకున్నట్లు మండలి ఛైర్మన్ వెల్లడించారు. టీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కొండా మురళి ఇదివరకే మండలి సభ్యత్వానికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

జగన్‌తో కేటీఆర్ బృందం భేటీ

(మొదటి పేజీ తరువాయి)

ఫెడరల్ ఫ్రంట్‌తో కలిసివెళ్లే సూచనలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే యూపీఏ కూటమితో తెదేపా అధినేత చంద్రబాబు జట్టుకట్టడం, ఆంధ్రప్రదేశ్‌లో భాజపాకు ఎదురుగాలి వీస్తుండటంతో జగన్ ముందున్న మూడో ప్రత్యామ్నాయం ఫెడరల్ ఫ్రంట్ ఒక్కటే కనిపిస్తోంది.

మరో వైపు తెలంగాణలో మహాకూటమి తరఫున ప్రచారం చేసిన ఏపీ సీఎం, తెదేపా అధినేత చంద్రబాబుకు రిటర్న్ గిఫ్ట్ ఇస్తామని తెలంగాణ సీఎం కేసీఆర్ గతంలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏపీలో ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్‌తో తెరాస నేతల భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనుండటంతో వైకాపా, తెరాస నేతల భేటీ రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది.

పందెం మంత్రులు

(మొదటి పేజీ తరువాయి)

అశోక్‌గజపతిరాజు, రాష్ట్రమంత్రి గంటా శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు కోడిపందాల్లో పాల్గొని హైందవ సాంప్రదాయాలను భ్రష్టుపట్టించారని పలువురు ఆరోపిస్తున్నారు. సాక్షాత్తూ ఆలయ అనువంశిక ధర్మకర్త అయివుండి అశోక్ గజపతిరాజు పాల్గొనడం దారుణమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంక్రాంతి పండుగకు కోడిపందాలు సాంప్ర దాయ క్రీడగా జరుపుకుంటున్నప్పటికీ న్యాయస్థానం నుంచి అనుమతులు లేవు. టీడీపీ నేతల కనుసన్నల్లో పోలీస్ బాస్‌లు చూసిచూడనట్లు వదిలేస్తున్నారు. అయితే సాక్షాత్తూ సింహగిరిపై ఇలాంటి కొత్త ఆచారానికి తెరలేపడంతో హిందువులు ఆందోళనకు గురవుతున్నారు. అటువంటి వారిపై చట్టపరమయిన చర్యలు తీసుకోవాలి. మరి సామాన్య భక్తులయితే తీసుకోవచ్చు. అదే దేవాలయ చైర్మన్, మాజీ కేంద్ర మంత్రి, రాష్ట్ర మంత్రి, ముందు యూనియన్ నాయకుడు, ఈవో కోడిపందాల నిర్వహణ జరిపారు. అది సాక్షాత్తు సింహాద్రి అప్పన్న ఆలయ రాజగోపురం ఎదురుగా, అంతేకాదు సంక్రాంతి సంబరాల పేరుతో అంతా పల్లెటూరు వాతావరణమంటూ అన్నిటితో పాటు, కోళ్ల ను కూడా ప్రదర్శనలో ఉంచడమే కాకుండా, సింహగిరిపై కోడిపందాలనిర్వహణ జరిపి మరో అపచారాన్ని మూటకట్టుకున్నారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాల్సిన ఆలయ ఈవో ఇలాంటి అపచారం, పాపపు పనులు చేస్తున్న మంత్రులకు కొమ్ముకాస్తూ ఫోటోలకు ఫోజులివ్వడంతో సింహగిరిపై భక్తులంతా ఆశ్చర్యానికి గురయ్యారు.సంబంధిత అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలనిభక్తులు కోరుతున్నారు. మరో ప్రక్క ఇటువంటి పందాల సంప్రదాయం పవిత్ర దేవాలయం లో పెట్టకూడదనే విషయాన్ని దేవాలయ వైదికులు, ఆగమ శాస్త్ర పండితులు సైతం అధికారులకు, మంత్రులకు చెప్పకపోవడం మరింత విడ్డూరంగా ఉంది.

డబ్బుతో ఆడినా, సరదాగా ఆడినా, చట్టం దృష్టిలో జూదం జూదమే... పందెం పందమే అన్న విషయాన్ని గ్రహించలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నారు మన నాయకులు, అధికారులు. అంతే కాదు, సింహగిరిపై సాక్షాత్తు స్వామి దేవాలయంలో ఇంతటి అపచారం జరుగుతూ ఉంటే, చట్ట ప్రకారం నడుచు కోవాల్సిన పోలీసులు సైతం కోడిపందాలు చూస్తూ ఆనందించారు. మరోప్రక్క అధికారులు, మంత్రుల మెప్పుకోసం వైదిక వర్గాలు సైతం కోళ్లను చూస్తూ ఆనందంలో మునిగిపోయారు.

హోంమంత్రి ఇలాకాలో జోరుగా జూదపు పందాలు

(మొదటి పేజీ తరువాయి)

వుంటాయి. గుట్టుచప్పుడు కాకుండా కొబ్బరి తోటల్లో మద్యం సేవిస్తూ గుళ్ళాట, పేకాటలలో ప్రజలు మునిగిపోయారు. ఒక్క సంక్రాంతి పండుగకు హైదరాబాద్, విశాఖ తదితర దూరప్రాంతాల్లో స్థిరపడిన గోదావరి జిల్లాల వాసులంతా జూదంలో పాల్గొన్నారు. అనాది ఆచారంగా వస్తున్న క్రీడలను ప్రోత్సహిస్తామని నిర్వాహకులు బహిరంగంగా చెపుతున్నా పోలీసులు పట్టించుకోవడంలేదు. ఈమూడురోజులు సుమారు రెండువేల కోట్ల రూపాయిలు పందాలలో చేతులు మారాయి. ఇప్పటికైనా మంత్రులు ప్రత్యేకదృష్టి సారించి ఇలాంటి జూదక్రీడలను నిలిపివేయడానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఫుల్ జోష్

(మొదటి పేజీ తరువాయి)

అమ్ముడైపోయింది. నగర పరిధిలో దాదాపు 800 మటన్ దుకాణాలున్నాయి. ఆయా ప్రాంతాల్లో మటన్ కోసం నగర జనం ఎక్కడికక్కడే బారులు తీరారు.

తెగ తాగేశారు...

కనుమ పండుగ రోజున మందుబాబులు బాగా ఎంజాయ్ చేశారు. సుమారు రూ. 10 కోట్లకుపైగా మద్యం తాగేసారు. జిల్లా వ్యాప్తంగా మద్యం అమ్మకాలు విపరీతంగా పెరిగాయి. విశాఖ జిల్లాలోనూ, నగరంలోనూ కలిపి 401 మద్యం షాపులు, 125కుపైగా బార్లు ఉన్నాయి. రోజు రూ.6 కోట్లకు పైగా మద్యం విక్రయాలు జరుగుతాయి. అయితే కనుమ రోజు మాత్రం రూ.10 కోట్లకుపైగా మందు అమ్ముడైపోయినట్లు అంచనా వేస్తున్నారు. మద్యం దుకాణాల యజమానులు రెండు రోజుల ముందే భారీగా స్టాక్ తెచ్చుకుని సిద్ధం చేసుకున్నారు. వైన్ షాప్‌లు, బార్‌లు ముందు మందుబాబులు బారులు తీరారు. బార్ అండ్ రెస్టారెంట్‌లు మందుబాబుల కోసం ప్రత్యేకంగా అలంకరించారు. మందుబాబులను ఆకట్టుకునేలా మద్యం దుకాణదారులు ఆఫర్లు పెట్టారు. నగరంలోని మద్యం దుకాణాలను తెల్లవారుజామునే తెరిచి ఉంచారు. మందుబాబులు మద్యాన్ని బహిరంగంగా రోడ్లపై సేవిస్తున్నా పోలీసులు పట్టించుకునే పాపానికి పోలేదని పాదాచారులు పలు విమర్శలు గుప్పించారు. బుధవారం ఒక్కరోజే దాదాపు రూ. 10 కోట్లకు పైగా మద్యం విక్రయాలు జరిగినట్లు అంచనా. బీర్, లిక్కర్ అమ్మకాలు బాగానే జరిగాయి. మద్యం అమ్మకాలతో వ్యాపారం కలిసొచ్చిందని వ్యాపారస్థులు అంటున్నారు. అయితే మందుబాబుల అవసరాలను యజమానులు భారీగా సొమ్ము చేసుకున్నారు. అయినా కొనుగోలుదారులు ఏ మాత్రం వెనకడుగు వేయకుండా కొనుగోలు చేయడానికి ఎగబడ్డారు. కనుమ రోజున కేవలం మద్యం, మాంసాలకు జిల్లా, నగరవాసులు దాదాపు రూ.20 కోట్ల వరకు వెచ్చించారు.

పురుషుల దుస్తుల్లో శబరిమల ఆలయ దర్శనానికి యత్నం

మరోసారి ఉద్రిక్త పరిస్థితులు

కేరళ : శబరిమల పరిసర ప్రాంతాల్లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. శబరిమల ఆలయ దర్శనానికి వెళ్తున్న ఇద్దరు మహిళలను ఆందోళనకారులు అడ్డుకున్నారు. పంబ బేస్ క్యాంప్ దాటి వెళుండగా నీలిమల వద్ద వారిని అడ్డుకుని వెనక్కి పంపించారు. అనంతరం ఆ మహిళలను పోలీసులు సురక్షిత ప్రాంతానికి తరలించారు. కన్నూరుకు చెందిన ఇద్దరు మహిళలు ఎవరికి అనుమానం రాకుండా పురుషుల దుస్తుల్లో తెల్లవారుజామున 5 గంటల సమ యంలో శబరిమల దర్శనానికి వచ్చారు. దాదాపు 5 కిలోమీటర్లు నడిచారు. అయితే వీరిని ఆందోళన కారులు గుర్తించి అడ్డు కున్నారు. పోలీసులు పలువురు ఆందోళన కారులను అదుపులోకి తీసుకోవ దంతో మహి ళలు మరికొంత దూరం ముందుకు వెళ్లారు.



అయితే నీలిమల వద్ద పెద్దసంఖ్యలో ఆందోళనకారులు వీరిని అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు ఆందోళన కారులకు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. అనంతరం మహి ళలను పోలీసులు సురక్షిత ప్రాంతానికి తీసుకెళ్లారు. శబరిమల ఆలయాన్ని అన్ని వయస్సుల మహిళలు దర్శించుకోవచ్చని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే ఈ తీర్పుతో కేరళ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చోటుచేసు కున్నాయి. సుప్రీం తీర్పును వ్యతిరేకిస్తూ కొందరు అయ్యప్ప భక్తులు నిర సనలు చేపట్టారు. అయితే తీర్పు అనంతరం ఇటీవల శబరిమల ఆలయాన్ని తొలిసారి ఇద్దరు మహిళలు దర్శించుకుని చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే.

కోదాడ వద్ద రోడ్డు ప్రమాదం.. ముగ్గురి మృతి

కోదాడ రూరల్: సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ శివారులోని కోమరబండ కూడలి వద్ద జాతీయ రహదారిపై బుధవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు మృతి చెందగా బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడ వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు టైరు పేలడంతో రహదారిపై పల్టీ కొట్టి మరో రెండు వాహనాలను ఢీ కొట్టింది. ప్రమాద సమయంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురిలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. ఓ బాలుడికి తీవ్ర గాయాలు కావడంతో కోదాడ వైద్యశాలకు తరలించారు. మృతుల వివరాలు తెలియాల్సి ఉంది.

జంగారెడ్డిగూడెంలో భారీ అగ్నిప్రమాదం

జంగారెడ్డిగూడెం అర్బన్: పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెంలో ఇవాళ తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం జరిగింది. మంటలు చెలరేగి రెండు వస్త్రదుకాణాలు దగ్ధమయ్యాయి. బాధితుల కథనం ప్రకారం.. జంగారెడ్డిగూడెంలోని గంగానమ్మ కూడలిలో ఉన్న వస్త్ర దుకాణాల నుంచి పొగలు రావడం గమనించిన వాచ్‌మెన్ దుకాణాల యజమానులకు తెలిపాడు. వారు వెంటనే అగ్ని మాపక సిబ్బందికి సమాచారమివ్వగా.. సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొనేసరికి ఒక దుకాణం పూర్తిగా దగ్ధమైంది. మరో దుకాణానికి మంటలు వ్యాపించాయి. దీంతో మంటలను అదుపుచేయడానికి చాలా సమయం పట్టింది. విద్యుదాఘాతం వల్లే ఈప్రమాదం జరిగి ఉండొచ్చని అగ్నిమాపక సిబ్బంది భావిస్తున్నారు. ప్రమాదంలో రూ.60లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితులు చెబుతున్నారు.

కొనసాగుతున్న శ్రీనివాస్ విచారణ

హైదరాబాద్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం కేసులో నిందితుడు జనుపల్లి శ్రీనివాసరావును జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) తమ కార్యాలయంలో నాలుగో రోజు విచారిస్తోంది. న్యాయవాదుల సమక్షంలో నిందితుడిని ప్రశ్నిస్తున్నారు. శ్రీనివాసరావుతో పాటు పలువురిని ఎన్ఐఏ అధికారులు విచారిస్తున్నారు. ఆధారాలు ముందుంచి నిందితుడిని ప్రశ్నిస్తున్నారు. శ్రీనివాసరావు చెప్పే విషయాలను రికార్డ్ చేస్తున్నారు. ఎన్ఐఏ డీఐజీ ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో విచారణ కొనసాగుతోంది. మరో మూడు రోజుల పాటు నిందితుడు ఎన్ఐఏ కస్టడీలో ఉండనున్నాడు. ఎన్ఐఏ అధికారులతో కూడిన



మరో బృందం విశాఖపట్నంలో విచారణ జరుపుతోంది. శ్రీనివాసరావు ఆరోగ్య పరిస్థితి బాగుందని అతడి తరఫు న్యాయవాది సలీం తెలిపారు. విచారణ కోసం శ్రీనివాస్‌ను మరోసారి విశాఖపట్నం తీసుకెళ్లే అవకాశం లేదని, మిగతా మూడు రోజులు హైదరాబాద్‌లోనే విచారణ కొనసాగుతుందని వెల్లడించారు.

శ్రీవారిని దర్శించుకున్న పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులు

తిరుమల : తిరుమల శ్రీవారిని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులు నేడు దర్శించుకున్నారు. ఈ తెల్లవారుజామున వీఐపీ విరామ సమయంలో వీరు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అధికారులు ఆలయ మర్యాదలతో వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదా శీర్వచనం చేశారు. ఆలయ తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యుడు, తెలంగాణ ఎంపీ బండ ప్రకాష్ మాట్లాడుతూ.. తిరుపతి రైల్వేస్టేషన్ లో నేడు జరగబోయే సౌత్ సెంట్రల్ రైల్వే వర్క్ షాప్ లో పాల్గొనేందుకు తిరుపతికి విచ్చేసినట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాల ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు. జాతీయ పార్టీతో పొత్తు ఉంటేనే మనకు లాభం అనే భావన నుంచి ప్రాంతీయ పార్టీలు బయటకు రావాలన్నారు.



నిర్ణయాత్మక ప్రధాని కావాలి.. కూటములు కాదు

అరుణ్ జైట్లీ

ఢిల్లీ: భారత్ ఆర్థికాభివృద్ధి సాధించేందుకు, దేశ ప్రజల ఆంకాక్షలను నెరవేర్చేందుకు విస్పష్టంగా నిర్ణయాలు తీసుకోగల ప్రధాన మంత్రి కావాలని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. పనిచేయని కూటముల వల్ల దేశానికి ఎలాంటి ప్రయోజనం ఉండదని ఆయన తన తాజా బ్లాగ్‌పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా మారిందన్నారు. అయితే 7-7.5 శాతం జీడీపీ వృద్ధితో తాము సంతృప్తిగా లేమని, 8శాతం దాటాలని కోరుకుంటున్నామన్నారు. భారత్‌కు ఎవరు ప్రధాని అయినా ఈ లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. 2014 ఎన్నికల్లో మాదిరిగా స్పష్టమైన మెజార్టీతో ప్రధాని పదవి చేపట్టినట్లుగానే.. ఇప్పుడు కూడా జరగాలని పేర్కొన్నారు.

దేశ అభివృద్ధికి భరోసా ఇవ్వాలంటే.. నిర్ణయాత్మక నాయకత్వం, విధానపరమైన సూచనలకు స్థిరత్వం, బలమైన ప్రభుత్వం ఉండాలని జైట్లీ బ్లాగ్‌లో వెల్లడించారు. కానీ పనిచేయని కూటములు, వాటి నాయకత్వాల వల్ల ప్రయోజనం ఉండదని, అవి ఎంతో కాలం నిలవవని, ఇలాంటి పరిస్థితుల్లో లక్ష్యాలను చేరుకోవడం సాధ్యం కాదని పేర్కొన్నారు. మోదీ హయాంలో జీడీపీ 7.3 శాతంగా నమోదైందని, అంతకుముందు యూపీఏ1 హయాంలో 6.9శాతంగా, యూపీఏ2 సమయంలో 6.7 శాతం ఉందని వివరించారు. అలాగే మోదీ నాయ కత్వంలో ద్రవ్యోల్బణం కూడా తగ్గిందని అన్నారు. గతంతో పోలిస్తే మోదీ హయాంలో చాలా అభివృద్ధి జరిగిందని చెప్పుకొచ్చారు.

ఆచార్య మొదలి నాగభూషణ శర్మ ఇక లేరు



విశాఖపట్నం, న్యూస్‌లీడర్: ఆచార్య మొదలి నాగభూషణ శర్మ ఇకలేరు. మంగళవారం రాత్రి ఆయన కన్నుమూశారు. తెలుగు నాటకరంగం గర్వించదగిన దర్శకులు, రచయిత, ప్రయోక్త, పరిశోధకులు, విమర్శకులు. తెలుగు నాటకానికి పెద్ద దిక్కు, ఉస్మానియా విశ్వవిద్యాలయం నాటక కళా విభాగం ద్వారా ఎందరో నటీనటులకు నట శిక్షణ యిచ్చిన ప్రొఫెసర్. రసరంజని ద్వారా వందలాది నాటకాలు ప్రదర్శించిన, ప్రదర్శింపజేసిన నాటక ప్రముఖులు. వారంక్రితమే తెనాలిలో అప్పాజోస్యుల జీవన సాఫల్య పురస్కారాన్ని అందుకున్నారు. యువ కళా వాహిని, డా అక్కినేని నాగేశ్వరరావు నాటక కళా పరిషత్, గురు ప్రసాద్ కల్చరల్ ఫౌండేషన్ నాటక భూషణులు నాగభూషణశర్మకి ఘన నివాళులు అర్పించారు.

ప్రపంచ బ్యాంక్ అధ్యక్షురాలిగా ఇంద్రానూయి?

వాషింగ్టన్ : ప్రపంచ బ్యాంక్ అధ?్యక్ష పదవి రేసులో భారత సంతతికి చెందిన పెప్సికో మాజీ సీఈఓ ఇంద్రానూయి తెరపైకి వచ్చారు. అగ్రరాజ్యం అమెరికా ప్రతిపాదనతో ఆమె ఆ పదవిని చేపట్టే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. ప్రపంచ బ్యాంక్ అధ్యక్షురాలిగా ఇంద్రా నూయిని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంకా ట్రంప్ నామినేట్ చేసినట్టు 'న్యూయార్క్ టైమ్స్' వెల్లడించింది.



ప్రపంచ బ్యాంక్ ప్రస్తుత అధ్యక్షుడు జిమ్ యాంగ్ కిమ్ పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 1న ఆయన పదవి నుంచి తప్పుకుంటున్నట్లు ఇటీవల ప్రకటించారు. దీంతో అధ్యక్ష పదవికి ఎన్నిక అనివార్యమైంది. 12 ఏళ్లు పెప్సీకో సీఈఓగా పనిచేసిన ఇంద్రా నూయి.. గత ఆగస్ట్‌లో పదవి నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే. ప్రపంచ బ్యాంక్‌లో అమెరికా అతిపెద్ద భాగస్వామి అయినందున ఆ దేశం సూచించిన వ్యక్తికే పదవి దక్కే అవకాశం ఉంది. ప్రపంచ బ్యాంక్ అధ?్యక్ష పదవికి అమెరికా తన పేరును ప్రతిపాదిస్తే ఇంద్రా నూయి ఏమంటారో చూడాలి. అధ్యక్షుడిని ప్రతిపాదించే వ్యక్తుల్లో ఇవాంక ట్రంప్ కీలక వ్యక్తి కావడంతో ఆమె విజ్ఞప్తిని సభ్య దేశాలు ఆమోదించే అవకాశం ఉంది. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతురాలైన మహిళల్లో ఇంద్రా నూయికి ప్రత్యేక స్థానం ఉందంటూ ట్రంప్, ఇవాంకా అనేక సార్లు ప్రశంసించిన విషయం తెలిసిందే. ప్రపంచ బ్యాంక్ అధ్యక్ష పదవికి మొదట ఇవాంక, నిక్కి హేలి పేర్లు కూడా వినిపించిన విషయం తెలిసిందే.

సంచలన వార్తా పత్రిక
లీడర్
విశాఖపట్నం సిటీ
3
విశాఖపట్నం
బుధవారం 17-1-2019

అనాధకు చేయూత



విజయనగరం, న్యూస్‌లీడర్: అసలే చలిపులి చిట్టడవిలాంటి పొదల మద్య ఓ అబాగ్యురాలి ఆక్రందన అటుగా వెళుతున్న భాటసారి చలించి చేయూతనందించి, తన ఆకలి తీర్చి దాతృత్వాన్ని చాటుకున్నారు శ్రీ ఖాదర్‌షా ఖాదర్ హౌల్యా ప్రియ శిష్యుడు, సమర్ధసద్గురువు, అలుపెరగని అన్నదాత అతావుల్లా షరీఫ్‌షా తాజ్ ఖాదరీబాబా ఆశిస్సులతో వారి ప్రియతనయుడు, వెలుగు వృద్ధాశ్రమ నిర్వాహకులు డాక్టర్ ఖలీలుల్లా షరీఫ్(ఖలీల్‌బాబా). వివరాల్లోకి వెళితే.. విజయనగరం వెంకటలక్ష్మీ సినిమాహాలు రహదారి నుంచి కంటోన్మెంట్ వెళ్లే రోడ్ రైల్వే బ్రిడ్జి పక్కన గుబురు అడవి లాంటి పొదల్లో ఒక అనాథ తల్లి చలికి గజగజ వణుకుతూ కునుకు తీస్తోంది. మంచుతో కప్పబడి వుండటంతో ఏదో చెత్తమూట అనుకున్నారు అటుగా వెళ్ళే బాటసారులంతా. షరీఫ్‌కు అనుమానం వచ్చి అంత చలిలోనూ అందరిలా సాగిపోకుండా సందేహంతో చెత్తమూటవైపు వెళ్ళి చూశారు. ఆపొదల్లో చెత్తమూట అనుకున్న దానిలో అనాద మహిళ మృత్యువుతో పోరాడుతున్న దృశ్యం కనిపించింది. ఆవిడ స్థితి చూసి గుండె కదిలింది. తట్టి లేపగా లేచి కూర్చుంది. ఆకలితో అలమటిస్తూ చావుబతుకుల మద్య పోరాటం సాగిస్తుందని గ్రహించారు. దగ్గర్లో వున్న హొటల్‌కి వెళ్ళి వేడి వేడి బోజనం తెచ్చి చేతికి ఇచ్చారు. ఇవ్వగానే గబ గబా తినగలిగినంత తిన్నది. తమతో రమ్మని కోరాడు.

అనాధ మహిళ నిరాకరించింది. వెంటనే గార్మెంట్ షాపు నుండి దుస్తులు,శాలువా కొనితెచ్చి కప్పి వెనుతిరిగారు. ఆవిడను చూసి చాలాసేపు షాక్ లోంచి కొలుకోలేక పోయిన దాత లీడర్‌ని సంప్రదించి తన అనుభవాన్ని తెలిపారు. కడుపు నిండా అన్నం పెట్టి, వస్త్రదానం చేయడంలో వున్నతృప్తి వర్ణనాతీతమని షరీఫ్ తెలిపారు. చాలీచాలని ఆదాయంతో జీవనం సాగిస్తున్న తమలాంటి వారికి బారంతో కూడుకున్న పని అయినప్పటికీ తన కన్నవారికి సేవ చేసినట్లు అనిపిస్తోందన్నాడు. సేవ చేయడంతో చాలా ఆనందంగా వుందన్నాడు. దగ్గర్లో వున్న అనాధ ఆశ్రమంలో చేర్పించడానికి తీవ్ర ప్రయత్నం చేసినప్పటికీ మహిళ నిరాకరించడంతో చేసేదేమి లేక వెనుదిరిగానన్నారు.

ఇగ్నో అడ్మిషన్లకు ఆఖరు తేదీ పొడిగింపు

అడ్మిషన్ల చివరి తేదీ జనవరి 31, 2019

అన్ని సర్టిఫికేట్, డిప్లొమా, డిగ్రీ, పి.జి. కోర్సులకూ వర్తింపు

ఆన్‌లైన్‌విధానం ద్వారా అడ్మిషన్లు

విశాఖపట్నం, న్యూస్‌లీడర్: ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) జనవరి 2019 కి గాను అందించే అన్ని సర్టిఫికేట్, డిప్లొమా, డిగ్రీ, పి.జి. కోర్సులలో ప్రవేశాలకి దరఖాస్తుల స్వీకరణ చివరి తేదీని జనవరి 31వ తేదీ వరకు పొడి గించారు. విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం పరిధిలోని అభ్యర్థులు ఆన్లైన్ విధానంలో కింద ఇవ్వబడిన లింక్ క్లిక్ చేసి జనవరి 31 లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. https: //onlineadmission.ignou.ac.in/admission/ఈ పొడిగింపు మానేజ్మెంట్ డిప్లొమా లలో చేరదలిచే వారికి కూడా వర్తిస్తుంది. ప్రవేశ పరీక్ష లేకుండా డిగ్రీ పాసైన ఎవరైనా చేయదగిన మేనేజ్మెంట్ డిప్లొమాలు కూడా ఇప్పుడు అందు బాటులో ఉన్నాయి. వీటికోసం విశా ఖపట్నంలోని ఇగ్నో ప్రాంతీయ కేంద్రా న్ని గానీ, దిగువ ఇవ్వబడిన వివిధ కళాశాలల్లో ఉన్న ఇగ్నో అధ్యయన కేంద్రాలను గానీ సంప్రదిం చాలన్నారు..

ఫీజు రీయింబర్సుమెంట్ : ఇగ్నో అందించే డిగ్రీ (బి.ఏ., బి.కాం., బి.ఎస్.సి, మరియు బి.పి.పి) కోర్సు లలో చేరే ఎస్.సి/ఎస్.టి. అభ్యర్థులకు ఫీజు రీయింబ ర్సుమెంట్ సదుపాయం ఉంది. దీన్ని పొందాలనుకునే వారు ముందుగా మిగిలిన అభ్యర్థులలానే ఆన్ లైన్ విధానంద్వారా పూర్తి ఫీజు చెల్లించి అడ్మిషన్ పొందాలి. ఆ తరువాత సంబంధిత విధానం ద్వారా రీయిం బర్సుమెంట్ కోసం దరఖాస్తు చేయాలన్నారు. పూర్తి వివరాలు ఇగ్నో ప్రాంతీయ కేంద్రం నుండి పొంద వచ్చు. మరింత సమాచారంకోసం ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రాన్నిగానీ ఇగ్నో అధ్యయన కేంద్రాల్ని గానీ సంప్రదించవచ్చు. ఆఖరు తేదీ పొడిగింపును ఆసక్తి గల అభ్యర్థులందరూ ఉపయోగించుకో వాలన్నారు.

వివేకానంద సంస్థలో సంక్రాంతి సంబరాలు



విశాఖపట్నం, న్యూస్‌లీడర్: శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ వద్ద గల అనాతల ఆశ్రమంలో గల వృద్ధులతో వివేకానంద సంస్థ వారు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. వారందరూ ఉన్న అనాథులు, ఆ భావన వాళ్లలో కలగకుండా మీకు అండగా మేమున్నామని సంస్థ వారు సంక్రాంతి పండగను వారితో జరుపుకున్నారు. వృద్ధులం దరూ నూతన వస్త్రాలు ధరించి ఆనందంగా ఒక కుటుంబంలా సంక్రాంతి పండగను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులందరూ పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్-2019

- ఫస్ట్ ర్యాంక్ సాధనకు కసరత్తు
- రంగంలోకి అంబాసిడర్లు, కళా బృందాలు
- ప్రజలను చైతన్యపరిచేందుకు వినూత్న కార్యక్రమాలు
- వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్న జీవీఎంసీ అధికారులు

విశాఖపట్నం,న్యూస్‌లీడర్: స్వచ్ఛ సర్వేక్షణ్-2019లో ఫస్ట్ ర్యాంక్ లక్ష్యంగా జీవీఎంసీ యంత్రాం గం కసరత్తు చేస్తోంది.ప్రతి ఏటా దగ్గరలోకి వచ్చి ఫస్ట్ ర్యాంక్ అవకాశాన్ని చేతులారా వదులుకున్న జీవీ ఎంసీ ఈ సారి ఎలాగైనా సాధించేందుకు పట్టుదలతో ముందుకు సాగుతోంది.గత ఫలితాలను పున:పరిశీలిం చుకొని, అలాంటిది ఈ సారి పునారవృతం కాకుండా పక్కా వ్యూహంతో దేశంలోనే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అగ్ర భాగాన నిలబడేందుకు రంగం సిద్ధం చేస్తోంది. దేశం లో అత్యంత అందమైన నగరంగా పేరుగాంచిన విశాఖ మహానగరం పేరు ప్రఖ్యాతలు మరో సారి విశ్వవ్యాప్తం అయ్యేందుకు ఇది దోహదపడుతుందని, అభివృద్ధికి బాటలు పడే అవకాశాన్ని చేజార్చుకోకుండా ఈ సారి మరింత దూకుడు పెంచాలని నిర్ణయించుకుంది. ముఖ్యంగా స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అత్యంత కీలక భూమిక పోషించనున్న నగర ప్రజల్లో పూర్తి స్థాయి అవగాహన, చైతన్యం తీసుకువచ్చేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే స్వచ్ఛభారత్ అంబాసిడర్లయిన నగరానికి చెందిన పలువురు ప్రము ఖులు వినూత్న కార్యక్రమాలు ద్వారా ప్రజలను ఆకర్షి స్తూ వారికి సంపూర్ణ అవగాహన కలిగే విధంగా 'స్వచ్ఛ సర్వేక్షణ్- 2019"లో అందరూ భాగస్వాములై మెజార్టీ ఓటింగ్ జరిగేలా అడుగులు వేస్తున్నారు. మరో వైపు జీవీఎంసీ అధికార యంత్రాంగం కూడా పలు కార్య క్రమాలు చేపడుతోంది. ఇందులో భాగంగా పలు కళా బృందాలను రంగంలోకి దించింది. క్షేత్రస్థాయిలో వారు విస్తృత ప్రచారం చేసే విధంగా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా అధికారులు, కళాబృందాలు జీవీ ఎంసీ పరిధిలో విస్తృతంగా పర్యటించి ప్రజల్లో అవగా హన కలిగిస్తున్నారు. ఈ నెల నాల్గోతేదీ నుండి ప్రచార రథం నగరవ్యాప్తంగా పర్యటిస్తోంది.ఈ నెల 31 వ తేదీ వరకు ఇది కొనసాగనుంది. ప్రజలు "స్వచ్ఛత యాప్ - పురసేవ యాప్"లను డౌన్‌లోడ్ చేసి ప్రజాభి ప్రాయాన్ని తెలపడం ద్వారా 2019 లో ప్రథమర్యాంక్ సాధనకు దోహదపడాలని వారు పిలుపునిస్తున్నారు. పారిశుధ్య సమస్య తలెత్తకుండా పూర్తి స్థాయి చర్యలు చేపడుతున్నారు. సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తునే మరో వైపు ప్రజల నుండి వస్తున్న ఫిర్యాదులు వెనువెంటనేపరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. టోల్ ఫ్రీ నెంబర్ 1969 కు ఫోన్ చేసి అభిప్రాయం తెలపాల్సిందిగా అధికారులు కోరుతు న్నారు. ఇదే సందర్భంలో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం అడిగిన ఏడు ప్రశ్నలకు సరైన సమాధానాలివ్వాలని కోరారు. పారిశుధ్య సిబ్బంది అనునిత్యం కాలువలు, రోడ్లు పరిశుభ్ర పరచడమేకాకుండా మరింత పరిశు భ్రతకు దోహదపడుతోంది. నగరంలోని బహిరంగ, వాణిజ్య ప్రదేశాలలో 3000లు పైగా స్టీల్, ప్లాస్టిక్ డస్ట్ బిన్లును జీవీఎంసీ ఏర్పాటు చేసి అందుబాటులో ఉం చింది. పారిశుధ్య సిబ్బందికి తడి-పొడిగా చెత్తను వేరుచేసి ఇవ్వాలని కోరుతూ ప్రతి రోజు ప్రతి ఇంటి నుండి జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది చెత్తను తడి-పొడి వేరుగాచేసి అందచేయాల్సిందిగా కోరుతు న్నారు.ప్రజల నుండి సేకరించిన చెత్తను తోపుడు బండ్ల ద్వారా సేకరించి, అలా సేకరించిన తడి చెత్తను సేంద్రియ ఎరువుగా తయారు ప్రక్రియ నిర్వహిస్తూ పొడి చెత్తను పునర్వినియోగించే విధంగా చర్యలు ప్రణాళికలు చేపట్టింది.అలాగే ప్రజల నుంచి సేకరి స్తున్న వ్యర్థాలు డంపింగ్ సైట్, శానిటరీ ల్యాండ్ ఫిల్ లేదా ప్రోసెసింగ్ కేంద్రానికి ఎరువుగా తయారు చేసేందుకు తరలిస్తున్నారు. రీసైకిల్ చేసేందుకు ు అనువుగాగల పొడి చెత్త నుండి పేపర్, ప్లాస్టిక్,మెటల్, గ్లాస్ తదితరాలను తిరిగి ఉపయోగిస్తున్నారు. . మిగిలిన పొడి చెత్తను భూమిలోనికి పంపిస్తున్నారు. సామాజిక మూత్రశాలలు, మరుగుదొడ్లు విషయంలో కూడా ప్రత్యేక శ్రద్ద వహిస్తున్నారు.జీవీఎంసీ వ్యాప్తంగా 4,500 సీట్లు కలిగిన అత్యాధునిక సదుపాయాలు కలిగిన 330 ప్రజా,సామాజిక మరుగుదొడ్లు నిర్మించి, వాటిని పొరుగు సేవల ఏజెన్సీల ద్వారా ప్రతి రోజు ఉదయం 4 గంటల నుండి రాత్రి 10 గంటలవరకు తెరచి ఉంచి, ఎప్పటికప్పుడ పరిశుభ్ర పరుస్తూ ప్రజలందరికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోంటున్నారు. అలాగే విశాఖనగరం బహిరంగ మలవిసర్జనరహిత నగరంగా (ఓడిఎఫ్) గా ధృవీకరిం చడంతో పాటు, బహిరంగ మూత్రవి సర్జన రహిత నగర స్ధాయికి రావడానికి ఓడిఎఫ్ (డబుల్ ప్లస్ ++) అమలు చేస్తోంది.జివియంసి కల్పిస్తున్న పౌరసేవలు, సదుపాయాలను వివరిస్తూ ఏడు ప్రశ్నలకు ప్రజలం దరు తమసానుకూల అభిప్రాయాన్ని స్వచ్ఛ సర్వేక్షణ్‌లో వెల్లడించే విధంగా కృషిచేస్తున్నారు. బహిరంగ మలవి సర్జనరహిత నగరంగా (ఓడిఎఫ్) గా ధృవీకరించినట్లు తెలియచేస్తూ బహిరంగ మూత్రవిసర్జనరహిత నగర స్థాయికి రావడానికి ఓడిఎఫ్ (డబుల్ ప్లస్ ++) అమలు చేస్తోంది.



జీవీ ఎంసీ కమిషనర్ హరినారా యణన్, సి.యం.ఓ.హెచ్ డాక్టర్ ఏ.హేమంత్ ప్రత్యేక శ్రద్ధతో "స్వచ్ఛ సర్వేక్షణ్- 2019" లక్ష్యంగా అధికా రులు, సిబ్బంది కార్యోన్ముఖులయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఏది ఏమైనా ఈసారి ఫస్ట్ ర్యాంక్ సాధించేందుకు ధృఢసంకల్పంతో ముందుకు సాగు తున్నట్టు తెలుస్తోంది.



గాంధీ సెంటర్ యూత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



విశాఖపట్నం,న్యూస్‌లీడర్: సంక్రాంతి సంబరాల్లో భాగంగా 17వ వార్డు లో నగర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు బైరెడ్డి పోతన్న రెడ్డి మరియు గాంధీ సెంటర్ యూత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు, తొలుత హరి దాసులు, గంగిరెద్దుల నృత్యాలు చేశారు తర్వాత ముగ్గులు పోటీల్లో గెలిచిన మహిళ లకి బహుమతులు అందజేశారు, ఈ కార్యక్రమం లో జెడ్జ్‌గా రాజ్య లక్ష్మి పాల్గొన్నారు, ఈ కార్య క్రమంలో వెంకటేశ్వర దేవ స్థానం చైర్మన్ గోపి, నాయకులు గోవిందా, శ్రీనివాస్,పోలి, నరేంద్ర, వాసు, గాంధీ సెంటర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఆకాశమంత పండగ...





సంక్రాంతి పండుగ సందర్భంగా విశాఖబీచ్‌లో గాలి పటాలతో సందడి చేస్తున్న నగర వాసులు







కళాభారతి వేదికగా సంగీత నీరాజనం

విశాఖపట్నం,న్యూస్‌లీడర్: కర్ణాటక శాస్త్రీయ సంగీత కళానిధి సద్గురు త్యాగరాజ స్వామికి విశాఖ నగరం వేదికగా ఉత్తరాంధ్రా సంగీత కళాకారులు సంగీత నీరాజనం అందించనున్నారు. ఈ నెల 24 నుంచి ఆరు రోజుల పాటు (29 వరకు) విశాఖ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో విశాఖనగరంలోని మద్దిలపాలెంలో గల కళాభారతి కళా ప్రాంగణంలో త్యాగరాజ ఆరాధనోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈమేరకు విశాఖ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ, కళాభారతి సంస్థ కార్యదర్శి జిఆర్కె ప్రసాద్ (రాంబాబు) డీఎన్ఎస్‌కు అందించిన వివరాల ప్రకారం వందలాది మంది వర్ధమాన సంగీత కళాకారుల నుంచి, జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రసిద్ధ కళాకారులు ఇదే వేదికపై గాత్ర కచేరీలు, వీణ కచేరీలు, వయొలిన్ కచేరీలు చేయనున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రముఖ వైణికులు, మహతి కళానిధి, సునాద సుధానిధి, వీణా వైద్య విశారద, జాతీయ సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత అయ్యగారి శ్యామసుందర్ ముఖ్య అతిథిగా హాజరు కాను న్నారు. ఇదే సభలో ఆలిండియా రేడియా వయొలిన్ విద్వాంసులు, ముట్నూరి శ్రీనివాస నరసింహ మూర్తి బృందం చే వయొలిన్ హరివిల్లు రమ్య అత్యంత వైభవంగా నిర్వహించబడుతుంది. ఈ వయొలిన్ హరివిల్లు లో ముట్నూరి శ్రీనివాస నరసింహ మూర్తికి డాక్టర్ పంతుల రామ, హెచ్. రామ్ చరణ్, ఎ. జ్ఞానదేవ్, తదితరులు వాయిద్య సహకారం చేయనున్నారు. జనవరి 25 ఉదయం 7:30 గంటల నుంచి త్యాగరాజ స్వామి సంకీర్తనలతో తిరు వీధి ఉత్సవం జరుగనుంది. ప్రముఖ విద్వాంసులకు త్యాగరాజస్వామి గా అలంకారం చేసి, కళాభారతి పరిసర వీధుల్లో త్యాగరాజస్వామి రచించిన సంకీర్తనలతో తిరువీధి నిర్వహించనున్నారు, ఈ ఉత్సవం లో ప్రముఖ కళాకారులూ, వర్ధమాన కళాకారులూ పాల్గొ నున్నారు. తదుపరి ఉదయం 8 : 30 గంటల నుంచి కళాభారతి ప్రధాన వేదిక పై 200 మంది కళాకారులచే ఘన పంచరత్న కీర్తనల సేవ జరుగుతుంది. ఈ నెల 25 నుంచి 29 వరకు ప్రతిరోజూ ఉదయం 7:30 గంటల నుంచి రాత్రి 9: 15 గంటల వరకు 10 నిముషాలు, 15 నిముషాలు, 30 నిమిషాల విడతలుగా మూడు విభాగాలుగా సంగీత కచేరీలు జరుగనున్నాయి. ఈ కచేరీల్లో కేవలం త్యాగరాజ స్వామి విరచిత కృతులు మాత్రమే పడవలసి యుంటుంది. విద్యార్థి దశలో సాధన చేసే వారికి 10 నిముషాల సమయం, ఆలిండియా రేడియో "బి" గ్రేడ్ ఆర్టిస్టుల కళాకారులకు 15 నిమిషాల సమయం, వున్నత స్థాయి విద్వాంసులకు 30 నిమిషాల సమయం కేటాయించడం జరుగుతుంది. సుమారు 600 మందికి పైగా కళాకారులూ దరఖాస్తు చేశారని, కేవలం 350 మందికి అవకాశం కల్పించడం జరిగిందని నిర్వాహకులు తెలియచేస్తున్నారు. ఈ 6 రోజుల సంగీత సంబరాల్లో పెద్దసంఖ్యలో పాల్గొని త్యాగరాజస్వామికి ఘన నీరాజనం అందించాలని నగరవాసులను ఆహ్వానిస్తున్నారు.



ఆరాధన ఉత్సవాల సంప్రదాయం:

ప్రముఖ వాగ్గేయకారులు త్యాగరాజు స్వామి పరమపదించిన రోజైన పుష్య బహుళ పంచమి రోజున త్యాగరాజా ఆరాధన ఉత్సవాలు దక్షిణ భారత దేశ ప్రాంతాలన్నింటిలో నూ వైభవంగా కర్ణాటక సంగీత నీరాజనం అందించడం జరుగుతుంది. ఆయన సమాధి ప్రాంగణం తమిళనాడు లోని, తంజావూరు జిల్లా, తరువ య్యూరులో ఈ ఉత్సవంలో జరపడం మొదలైంది. దాన్ని సం ప్రదాయంగా అన్ని ప్రాంతాల్లోనూ నిర్వహించడం ఆనవా యితీగా వస్తోంది. సంవత్సరానికి ఒక్కసారి జరిగే సంగీతోత్సవాలలో పాల్గొనేందుకు ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి కెక్కిన కర్ణాటక సంగీత విద్వాంసులు త్యాగయ్యకు తమ నివాళులు అర్పించడానికి విచ్చేస్తారు. ఈ ఉత్సవం త్యాగరాజు కావేరీ నది ఒడ్డున సమాధి సమీపంలో పుష్య బహుళ పంచమి నాడు జరుగుతుంది. సంగీత విద్వాంసు లంతా ఆయన సమాధి ప్రాంగణంలో ఆసీనులై ఆయన స్వర పరిచిన పంచరత్న కీర్తనలను బృందగానంగా ఆలపిస్తారు. ఆయన పరమ పదించి 171 సంవత్సరాలు గడిచినప్పటికీ, 1903 నుంచి ఆయన సమాధి వద్ద సంగీత ఉత్సవాలు క్రమం తప్పకుండా కొనసాగించడం జరుగుతోంది.

యూపీలో పొత్తు

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఉత్తరప్రదేశ్‌లో అఖిలేశ్ యాదవ్ నేతృత్వంలోని సమాజ్‌వాది పార్టీ (ఎస్పీ), మాయావతి సారథ్యంలో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) పొత్తుపెట్టుకోవడంతో ఫెడరల్ ఫ్రంట్ ప్రయత్నాలకు మరింత ఊపు వచ్చినట్టయింది. బీజేపీకి వ్యతిరేకంగా బలమైన కూటమిగా ఏర్పడిన ఎస్పీ, బీఎస్పీ కాంగ్రెస్‌ను తమ కూటమిలో చేర్చుకోకపోవడం విశేషం. ఇటీవల రాజస్థాన్, మధ్యప్రదేశ్ అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల్లో బీజేపీ వ్యతిరేక తీర్పు రావడం కాంగ్రెస్ కన్నా, ఎస్పీ, బీఎస్పీల ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఈ రెండు రాష్ట్రా ల్లో బీజేపీ వ్యతిరేకత ద్వారా కాంగ్రెస్ పూర్తిగా లబ్ధి పొందలేకపోయింది. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ వ్యతిరేకతతోపాటు, తమకున్న సామాజిక పునాది ద్వారా గెలువాలని ఎస్పీ, బీఎస్పీ భావిస్తున్నాయి. అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో ఎనభై లోక్‌సభ స్థానాలున్నాయి. అత్యంత బలమైన పార్టీలు ఎస్పీ, బీఎస్పీ ఏకతాటిపైకి రావడం విశేష పరిణామం. ఇదే సందర్భంలో ఒడిశా ముఖ్యమంత్రి, బిజూ జనతాదళ్ నాయకుడు నవీన్ పట్నాయక్ కూడా తాము బీజేపీ, కాంగ్రెస్‌ల నేతృత్వంలోని ఏ కూటమిలో చేరబోమని స్పష్టం చేశారు. ఒడిశాలో 21 లోక్‌సభ స్థానాలున్నాయి. మరో తూర్పు రాష్ట్రమైన పశ్చిమ బెంగాల్‌లో 42 లోక్‌సభ స్థానాలున్నాయి. ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు మమతా బెనర్జీ కూడా ఈ రెండు జాతీయ పార్టీల పట్ల విముఖంగా ఉన్నారు. టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇటీవల ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు యత్నాల కోసం చేపట్టిన యాత్రలో తూర్పు ప్రాంత రాష్ట్రాలనే ఎంచుకోవడం గమనార్హం. ఉత్తరప్రదేశ్‌లోని ఎనభై లోక్‌సభ స్థానాల్లో ఎస్పీ, బీఎస్పీ చెరి 38 స్థానాలకు పోటీ చేస్తున్నాయి. మిగిలిన నాలుగు స్థానాల్లో రెండు అజిత్ సింగ్ నేతృత్వంలోని రాష్ట్రీయ్ లోక్‌దళ్ (ఆర్ఎల్‌డీ)కు వదిలిపెట్టాయి. సోనియా గాంధీ, రాహుల్ పోటీ చేసే రాయ్‌బరేలీ, అమేథీ స్థానాలను కాంగ్రెస్‌కు వదిలేసి పోటీ పెట్టకూడదని నిర్ణయించాయి. కాంగ్రెస్‌కు ఆ రెండు స్థానాల ను మర్యాద కోసం వదిలిపెట్టాయే తప్ప పొత్తు పెట్టుకొని కాదు. కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంటే కొరివితో తల గోక్కున్నట్టనే అభిప్రాయం ఎస్పీ, బీఎస్పీలకు ఉన్నది. కాంగ్రెస్‌తో యూపీ వరకు పొత్తు పెట్టుకున్నా, దేశవ్యాప్తంగా కాంగ్రె స్ కూటమిలో భాగమైపోతాయి. జాతీయ స్థాయిలో ప్రధాని పదవి కోసం మోదీకి, రాహు ల్ గాంధీకి మధ్య పోటీగా కనిపిస్తుంది. అంతేతప్ప తమ బలం ఆధారంగా పోటీ పడుతున్న ట్టు కనిపించదు. రాహుల్ గాంధీని నెత్తిన మోయడం వల్ల నష్టమే తప్ప అదనపు ప్రయోజనం ఏమీ లేదు. 2009 లోక్‌సభ ఎన్నికల్లో కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో 21 స్థానాలు గెలుచుకున్న కాంగ్రెస్ ఇంకా అదే భ్రమలో ఉన్నది. ఈసారి ఎంత కాదన్నా కనీసం 25 సీట్లు అడుగవ చ్చు. కాంగ్రెస్ నాయకత్వం యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో వంద సీట్లు కేటాయించే వరకు అఖిలేశ్ ను ఇబ్బంది పెట్టింది. ఈ అనుభవం మూలంగానే కాంగ్రెస్‌ను దూరంగా పెట్టాయి. యూపీ అంతటా విస్తరించి ఉన్న ఎస్పీ, బీఎస్పీ చెరి సగం సీట్లు పంచుకోవడమంటే, చెరి సగం సీట్లు వదులుకోవడం. క్షేత్రస్థాయిలో ఈ రెండు పార్టీల కార్యకర్తలు కలిసిపోవడం, ఓటు బ్యాంక్ బది లీ కావడం నాయకులు పొత్తు పెట్టుకున్నంత సులభం కాదు. అందుకే అజిత్‌సింగ్‌తో కనీసం చర్చలు జరుపకుండా రెండు సీట్లు వదిలిపెట్టాయి. అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో ఏ ఒక్క పార్టీ ఒంటరిగా అధికారానికి రావడం కష్టతరం. కొంతకాలం సంకీర్ణ ప్రభుత్వాలే తప్ప ఏక పార్టీ పాలన జరుగలేదు.

సీబీఐకి 'సుప్రీం' కవచం

మూడు నెలలక్రితం హఠాత్తుగా ఓ అర్ధరాత్రి సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మను సెలవుపై పంపిన ఎన్‌డీఏ ప్రభుత్వ నిర్ణయానికి సర్వోన్నత న్యాయ స్థానంలో చుక్కెదురైంది. ఆయన్ను తిరిగి ఆ పదవిలో కొనసాగిస్తూ సుప్రీంకోర్టు ధర్మాసనం ఉత్తర్వులు వెలువరించింది. అయితే తనపై వచ్చిన ఆరోపణలపై విచారణ పూర్తయ్యేవరకూ అలోక్ వర్మ ప్రధానమైన విధాన నిర్ణయా లను తీసుకోరాదని స్పష్టం చేసింది. ఆయనపై ఇప్పటికే ప్రధాన విజిలెన్స్ కమిషనర్(సీవీసీ) దర్యాప్తు చేసి సమర్పించిన నివేదిక ప్రభుత్వం దగ్గరుంది. దాన్ని ప్రధాని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, లోక్‌సభలో ప్రతిపక్ష నేతలతో కూడిన ఎంపిక సంఘం పరిశీలించి వారంలోగా తన నిర్ణయాన్ని ప్రకటించాలని కూడా సుప్రీంకోర్టు ఆదేశించింది.

అయితే అలోక్ పదవీకాలం ఈ నెలాఖరుతో పూర్తవుతుంది. ఇప్పటికే ఆయన వారసుడి ఎంపిక కోసం కేంద్రం 9మందితో ఒక జాబితా రూపొందించింది. అలోక్ విషయంలో తమ నిర్ణయాన్ని సుప్రీంకోర్టు మౌలికంగా తప్పు బట్టలేదని, కేవలం ఎంపిక సంఘం చేయాల్సిన పనిని ప్రభుత్వమే చేసిందన్నదే దాని అభ్యంతర మని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ అంటున్నారు. అందుకు రుజువుగా ప్రధానమైన విధాన నిర్ణయాలు తీసుకోరాదని అలోక్‌పై ఆంక్షలు విధించడాన్ని చూపు తున్నారు. అయితే సెలవుపై పంప డానికి కారణమైన సీవీసీ నివేదికను ఈ విచారణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు సమర్పించింది. దాన్ని చూశాక కూడా అలోక్ వర్మ యథావిధిగా పదవిలో కొనసాగవచ్చునని ధర్మాసనం చెప్పిందంటే ఆ ఆరోపణల్లో అంత పస లేదన్న అభిప్రాయం అందరికీ కలుగుతుంది.

సీవీసీ నివేదికపై అభిప్రాయం చెప్పమని రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ ఏకే పట్నాయక్‌ను సుప్రీంకోర్టు కోరింది. ఆయన అభిప్రాయం వెల్లడయ్యాకే ధర్మాసనం తాజా ఉత్తర్వులిచ్చింది. చివరిగా ఎంపిక సంఘం ఏం తేలుస్తుందన్న సంగతలా ఉంచితే సీబీఐ స్వతంత్రతను కాపాడటానికి సుప్రీంకోర్టు పడుతున్న తపనను ఈ తీర్పు తేటతెల్లం చేస్తోంది. ప్రస్తుతం సీబీఐకి తాత్కాలిక డైరెక్టర్‌గా ఉంటున్న జాయింట్ డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావును ధర్మాసనం ఆ బాధ్యతలనుంచి తప్పించింది. ఇంతకూ అలోక్‌తో లడాయికి దిగిన ఆ సంస్థ ప్రత్యేక డైరెక్టర్ రాకేష్ అస్థానా పరిస్థితేమిటో మాత్రం తీర్పు స్పష్టం చేయలేదు. కేంద్రం నిర్ణయాన్ని అలోక్ సవాలు చేశారుగానీ అస్థానా మౌనంగా ఉండి పోయారు. కానీ తనకు వ్యతిరేకంగా అలోక్ నమోదు చేయించిన అవినీతి కేసును కొట్టేయాలని ఆయన ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. అదింకా పెండింగ్‌లో ఉంది.

కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ సర్కారు ఆ సంస్థను ఎంతగా భ్రష్టు పట్టించిందో ఎవరూ మరిచిపోలేరు. దేశంలోనే ఉన్నతశ్రేణి దర్యాప్తు సంస్థగా పేరు ప్రఖ్యాతులున్న ఆ సంస్థ యూపీఏ ప్రభుత్వ తీరుతో నీరసించింది. ఒక దశలో 'పంజరంలో చిలుక'లా వ్యవహరించవద్దని సీబీఐని సర్వోన్నత న్యాయస్థానం చీవాట్లు పెట్టవలసి వచ్చింది. కానీ దానికి అధిపతులుగా వచ్చినవారిలో మాత్రం ఆ వ్యాఖ్య ఏ మార్పూ తీసుకురాలేదు. ఇవాళ ఎన్‌డీఏ సర్కారు కొత్తగా దాన్ని, మరికొన్ని ఇతర వ్యవస్థలను భ్రష్టు పట్టించిందని ఆరోపిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాను విపక్షంలో ఉండి కూడా కాంగ్రెస్‌తో చీకటి లాలూచీలు నడిపి సీబీఐని చెప్పుచేతల్లో పెట్టుకోవడానికి ఎలా ప్రయత్నించారో అందరికీ గుర్తుంది. సమస్యంతా ఇలాంటి వారితోనే.

అటు కాంగ్రెస్‌కూ, ఇటు చంద్రబాబుకూ సీబీఐ తమ పంజరంలో చిలుకలా ఉండాలి. కానీ వేరేవాళ్ల పంజ రంలో ఉండటమే వారికి అభ్యంతరకరం. తమ చరిత్రలు ప్రజలకు తెలుసన్న



ఇంగితజ్ఞానం ఈ బాపతు నేతలకు ఉండటం లేదు. కేంద్రంలోని ఇతర విభాగాల కంటే సీబీఐపైనే ఎక్కువగా ఆరోపణలు వస్తుంటాయి. అది అధికారంలో ఉన్నవారు చెప్పినట్టల్లా ఆడుతోందన్నది వాటిల్లో ప్రధానమైనది. కానీ ఈమధ్య కాలంలో దాని వ్యవహారాలు మరింతగా శ్రుతిమించాయి. అలోక్ వర్మ రాకేష్ అస్థానాపై దర్యాప్తు మొదలెట్టారు. ఈ సంగతి తెలిసి అస్థానా సైతం అలోక్ వర్మపై ఎదురు దర్యాప్తునకు ఆదేశాలిచ్చి అందరినీ విస్మయంలో పడేశారు. అంతేకాదు... ఇద్దరూ సీవీసీ దగ్గర పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. అలా ఫిర్యాదులు చేసుకున్నప్పుడు దాన్ని ఆసరాగా తీసుకుని సీబీఐ వ్యవహారాలను తన చేతుల్లోకి తీసుకోవాలనుకోవడం కేంద్రం చేసిన తప్పిదం. సంక్షోభం తలెత్తినప్పుడు ఏం చేయాలన్న విషయంలో నిబంధనలు స్పష్టంగా ఉన్నప్పుడు వాటిని కాదని ఇష్టానుసారం చేయడం సరికాదు. తాము అలోక్, అస్థానాలను బదిలీ చేయడం లేదా తొలగించడం వంటివి చేయలేదు గనుకే ఎంపిక సంఘాన్ని సంప్రదించలేదన్న అటార్నీ జనరల్ వాదనను సుప్రీంకోర్టు అంగీకరించలేదు. ఎంపిక సంఘం ద్వారా సీబీఐ నిర్వహణా బాధ్యతల్ని తీసుకున్న అలోక్‌ను వాటినుంచి తప్పించడమంటే సారాంశంలో ఆయన్ను పంపించడమే అవుతుం దని, ఇది ఎంపిక సంఘం పరి ధిలోనిదని స్పష్టం చేసింది. రాజకీయ ప్రత్యర్థులను దెబ్బతీయడానికి సీబీఐని, ఇతర వ్యవస్థలనూ ఇష్టానుసారం వినియోగించుకునే దుస్సంప్రదాయాన్ని నిలువరించడానికి తాజా తీర్పు ఎంతోకొంత దోహదపడుతుందనడంలో సందేహం లేదు. ఇకపై ప్రభుత్వాలు సీబీఐ విషయంలో మెలకువతో వ్యవహరిస్తాయి. కానీ డైరెక్టర్లుగా వచ్చేవారు ఈ తీర్పును కవచంలా ఉపయోగిం చుకుంటారా లేక యథాప్రకారం పాలకుల అభీష్టాన్ని నెరవేర్చే అలవాటును కొనసాగిస్తారా అన్నది చూడాలి. త్రికరణశుద్ధిగా విధులు నిర్వర్తిం చాలని, తాము నేతృత్వం వహిస్తున్న సంస్థ అత్యు త్తమ ప్రమాణాలను అందుకునేలా తీర్చిదిద్దాలన్న సంకల్పం కొరవడినప్పుడు ఎవరూ ఏం చేయలేరు. సంస్థలో తీసుకునే నిర్ణయాలన్నిటికీ అన్ని స్థాయి ల్లోనూ జవాబుదారీతనం ఉండేలా పకడ్బందీ నిబంధనలు రూపొందేవరకూ వ్యక్తుల నిజా యితీపైనే వ్యవస్థల విశ్వసనీయత ఆధారపడక తప్పదు.

పండగ వేళ...పోషకాలు అందేలా



రేగు పండ్లు... చెరకు ముక్కలు... నువ్వుల లడ్లు.. ఇవన్నీ ఉంటేనే సంక్రాంతి. మరి అవి ఆరోగ్యానికి ఎలా మేలు చేస్తాయో తెలుసా!

రేగుపండు: ఇవి నిద్రలేమిని దూరం చేస్తాయి. ఈ పండ్లలో విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలం. వందగ్రాముల పండ్లలో 69 మిల్లీగ్రాముల విటమిన్ సి లభిస్తుంది. అది వ్యర్థాలను తొలగిస్తుంది. రోగనిరోధకశక్తిని పెంచుతుంది.

చెరకు: ఇందులో ఫ్లవనాయిడ్లు, యాంటీ అలర్జీ, యాంటీ వైరల్, యాంటీక్యాన్సర్ కారకాలు అధికం. బాగా అలసిపోయినప్పుడు గ్లాసు చెరకురసం తాగి చూడండి. తక్షణ శక్తి అందుతుంది. చెరకు మూత్రపిండాలకు ఎంతో మేలుచేస్తుంది. డీహైడ్రేషన్ దూరం అవుతుంది. పిల్లలు చెరకు ముక్కలు నములుతుంటే దంతాలు శుభ్రపడటమే కాదు... గట్టిపడతాయి కూడా.

నువ్వులు: వీటిని తరచూ తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది. మలబద్ధకం దూరమవుతుంది. వీటిలో ఇనుము, క్యాల్షియం సమృద్ధిగా లభిస్తాయి. ఎదిగే ఆడపిల్లలకు నువ్వులతో చేసిన పదార్థాలు తినిపించడం వల్ల రక్తహీనత బాధించదు.

చర్మానికి సిక్స్‌ప్యాక్!



వర్షాకాలంలో చర్మం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. తడి తగిలితే ఒక్కోసారి చర్మం పాడయ్యే అవకాశం ఉంటుంది. అలాంటప్పుడే కొన్ని ఫేస్‌ప్యాక్స్ ప్రయత్నిస్తే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.

గంధం పొడి ప్యాక్: చర్మంపై ఏర్పడే నల్లవలయాలు, మచ్చలు పోవడానికి ఓ మార్గం ఉంది. అరకప్పు పసుపు పొడి, నాలుగో వంతు రోజ్ వాటర్, ఒక టేబుల్ స్పూన్ గంధం పొడి కలిపిన మిశ్రమాన్ని ముఖానికి పట్టించాలి. 30 నిమిషాల పాటు ఉంచి, ఆ తర్వాత చల్లటి నీళ్లతో కడుక్కోవాలి.

ఓట్స్ ప్యాక్: ఓట్స్ తినడానికే కాదు, ముఖ వర్చస్సు పెంచుకోవడానికి ఇవి పనిచేస్తాయి. ఓట్స్, తేనె, కోడి గుడ్డు సొన, పెరుగు కలిపిన మిశ్రమాన్ని ఫ్రిజ్‌లో ఉంచాలి. ఆ తర్వాత ముఖానికి పట్టించి, నీటితో కడుక్కోవాలి.

బనానా ప్యాక్: ముఖంపై ఏర్పడ్డ మచ్చలను అరటి గుజ్జు పోగొడుతుంది. అయితే అరటిగుజ్జు ఒక్కటే కాకుండా, దాంతో పాటు కాస్త పుదీనా ఆకులు కూడా వాడాలి. అరటిపండును గుజ్జుగా చేసి, అందులో పుదీనా ఆకులను వేసి గ్రైండ్ చేయాలి. ఈ పేస్ట్‌ను ముఖానికి పట్టించుకుని, 15 నిమిషాల పాటు ఉంచుకోవాలి.

బాదం, రైస్ ప్యాక్: ఒక కప్పు పెరుగులో బియ్యం పిండి , తగినన్ని బాదం పలుకులు వేసి ఓ పేస్ట్‌లా చేసుకోవాలి. దీన్ని రాత్రి నిద్రపోయేముందు రాసుకోవాలి.

కోడి గుడ్డు సొనతో ప్యాక్: కోడిగుడ్డు సొనలో తేనె కలుపుకొని, ఆ మిశ్రమాన్ని ముఖానికి రాసుకోవాలి. అది ఆరిపోయాక కడుక్కుంటే ముఖం ఫ్రెష్‌గా మారుతుంది. ఇది ఆయిలీ స్కిన్ వారికి బాగా పనికొస్తుంది.

టోనర్: ముఖంపై జిడ్డు పోగొట్టడం కోసం చాలా మంది టోనర్లు వాడతారు. వీటి వల్ల చర్మంపై మట్టి, దుమ్ము వదిలిపోతాయి. బయట దొరికే ఖరీదైన టోనర్లు కాకుండా ఇంట్లో కూడా వీటిని తయారు చేసుకోవచ్చు. ఫ్రిజ్‌లో ఉంచిన రోజ్‌వాటర్, కీరదోసకాయ రసం కలిపి మిశ్రమాన్ని ముఖానికి ప్రతి రోజు రాత్రి పట్టించుకుంటే మంచిది. ఇది అప్లై చేసుకోవడానికి కాటన్ ట్యాబ్ (చిన్న క్లాత్) వాడాలి.

లెక్కేసుకుని తినకండి...!




సన్నగా మారాలనుకుంటే...కేవలం అతిగా వ్యాయామం చేస్తేనో, అసలు తినడం మానేస్తేనో ఫలితం ఉంటుందనుకుంటే పొరబాటు. అలా చేయడం వల్ల కొన్నిసార్లు మీ అరోగ్యానికే ప్రమాదం.

ఆహారం: బరువు తగ్గాలనే ఆలోచన ఉన్నప్పుడు ఆహారం విషయంలో కచ్చితంగా పరిమితి అవసరం. అలా అని కెలొరీలు, కార్బోహైడ్రేట్‌లు లెక్కేసుకుని తినడం సరికాదు. దీనివల్ల తగినన్ని పోషకాలు శరీరానికి అందవు. అలానే జంక్‌ఫుడ్, మితిమీరిన తీపి, ప్రాసెస్ చేసిన పదార్థాలు తినడానికి మాత్రం నిరభ్యంతరంగా నో చెప్పండి. లేదంటే పోషకాల లేమి మిమ్మల్ని అనారోగ్యాల బారిన పడేటట్లు చేస్తుంది.

వ్యాయామం: తీసుకున్న ఆహారానికి తగినంత శ్రమ లేకపోతే శరీరంలో ఈస్ట్రోజన్ హార్మోన్ తగ్గి టెస్టోస్టెరాన్ హార్మోన్ స్థాయిలు శరీరంలో పెరిగిపోతాయి. ఫలితంగా ఒత్తిడి, అధికబరువు, నెలసరి క్రమం తప్పడం వంటి వెన్నో ఇబ్బందులు ఎదురుకావొచ్చు. అలాని మితిమీరి వ్యాయామం చేయడం కూడా మంచిది కాదు. మీరు తిన్న ఆహారానికి, మీ ఆరోగ్యానికి ఎంత మేరకు అవసరమో దానికనుగుణంగా మీ వ్యాయామ ప్రణాళిక ఉండాలి. అంటే...అది ఏ రకమైన వ్యాయామం అయినా సరే! కనీసం అరగంటసేపైనా మీ రోజువారీ జీవితంలో భాగం అయ్యేట్లు చూసుకోండి.

చరిత్రలో ఈరోజు -17



1706 : గొప్ప రచయిత, చిత్రకారుడు, రాజకీయ నాయకుడు, శాస్త్రవేత్త, మేధావి బెంజమిన్ ఫ్రాంక్లిన్ జననం (మ.1790).

1905 :ప్రసిద్ధ భారతీయ గణిత శాస్త్రజ్ఞుడు దత్తాత్రేయ రామచంద్ర కప్రేకర్ జననం (మ.1986).

1908 : తెలుగు సినీనిర్మాత, దర్శకుడు, నటుడు మరియు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత ఎల్.వి. ప్రసాద్ జననం (మ.1994).

1951 : భారతీయ సినిమా నటి బిందు జననం.

1989 : మొదటిసారి ఒక భారతీయుడు - కల్నల్ జె.కె.బజాజ్ - దక్షిణ ధృవాన్ని చేరుకున్నాడు.

1997 : ప్రవాస భారతీయులకు ద్వంద్వ పౌరసత్వం ఇచ్చేది లేదని భారత ప్రభుత్వం ప్రకటించింది.

2010 : పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా సుధీర్ఘకాలం పాటు పనిచేసిన జ్యోతిబసు మరణం (జ.1914).

1917 : తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, ప్రముఖ సినిమా నటుడు, ఎం.జి.రామచంద్రన్ జననం. ఎంజీఆర్ లేదా పురచ్చి తలైవర్ (క్రాంతియుత నాయకుడు) గా ప్రసిద్ధి చెందిన మరుదూరు గోపాల రామ చంద్రన్ (జనవరి 17, 1917- డిసెంబర్ 24, 1987) తమిళ సినిమా రంగములో ప్రముఖ నటుడు మరియు 1977 నుండి ఆయన మరణించేంతవరకు తమిళనాడు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నాడు. రామచంద్రన్ శ్రీలంకలోని కాండీ సమీపములోని నవలపితియాలో మరదూరు గోపాల మీనన్ మరియు సత్యభామ దంపతులకు జన్మించాడు. ఈయన కేరళ రాష్ట్రములోని పాలక్కడ్ జిల్లా, వడవన్నూరులోని మీనన్ కుటుంబానికి చెందినవాడు. ఈయన తాత కుటుంబముతో సహా శ్రీలంకకు తరలి వెళ్ళాడు. తండ్రి మరణము తర్వాత, పేదరికము వలన ప్రాథమిక స్థాయిని దాటి విద్యాభ్యాసము కొనసాగించలేక రామచంద్రన్ ఒరిజినల్ బాయ్స్ అనే ఒక నాటకబృందములో చేరాడు. ఇక్కడ రంగస్థలంపై తగినంత అనుభవము గడించి, సినిమా రంగములో అడుగుపెట్టి అవిరాళ కృషి, పట్టుదలతో అత్యున్నత స్థాయికి ఎదిగాడు. అత్యంత ప్రజాదరణ కలిగిన నటునిగా ఎదిగాడు. ఈయన మంచి దర్శకుడు, నిర్మాత మరియు నైపుణ్యమున్న సినిమా ఎడిటరు కూడా. ఎంజీయార్ భార్గవి (తంగమణి) ని పెళ్ళి చేసుకున్నాడు. పెళ్ళైన కొన్నాళ్ళకే ఈమెకు జబ్బు చేసి మరణించింది. ఆ తరువాత సదానందవతిని రెండవ పెళ్ళి చేసుకున్నాడు. ఈమె కూడా కొన్నాళ్ళకే క్షయ వ్యాధితో మరణించింది.

దిన ఫలాలు

గురువారం -17-1-2019

మేషం: దూర ప్రాంతాల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు. సంఘ సేవాకార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

వృషభం: బంధువులతో కలిసి ఉల్లాసంగా గడుపుతారు. విందు వినోదాలలో చురుకుగా పాల్గొంటారు. సంఘంలో పలుకుబడి పెరుగుతుంది. ఉద్యోగావకాశాలు పొందుతారు.

మిథునం: సంఘంలో ఆదరణ పొందుతారు. ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. ఆర్థికాభివృద్ధి సాధిస్తారు. వృత్తి, వ్యాపారాలలో లాభాలు గడిస్తారు.

కర్కాటకం: ఋణాలు కొంతవరకు తీరుస్తారు. గృహనిర్మాణ ఆలోచనలలో తొందరపాటు తగదు. ఇంటాబయటా బాధ్యతలు పెరిగినా సమర్ధవంతంగా నిర్వహిస్తారు.

సింహం: మిత్రులతో ఏర్పడిన మాటపట్టింపులు పరిష్కరించుకుంటారు. ఆర్థికపరిస్థితి అనుకూలంగా ఉంటుంది. బంధువుల నుంచి కీలక సమాచారం అందుతుంది.

కన్య: కొత్త విషయాలను తెలుసుకుంటారు. సంతానం నూతన విద్య, ఉద్యోగావకాశాలు పొందుతారు. చిన్ననాటి మిత్రులతో కలిసి ఆనందంగా గడుపుతారు.

తుల: చేపట్టిన పనులలో ఆటంకాలు ఏర్పడినా అధిగమిస్తారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. ప్రయాణాలు లాభిస్తాయి. ఇంటాబయటా చికాకులు.

వృశ్చికం: ఆర్థికపరిస్థితి అంతంతమాత్రంగా ఉంటుంది. పనులు నెమ్మదిగా సాగుతాయి. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి. ఉద్యోగాలలో ఎదురైన ఒత్తిడి తొలగిపోతుంది.

ధనుస్సు: ఇంటాబయటా ప్రోత్సాహం లభిస్తుంది. బంధువులతో కలిసి ఆనందంగా గడుపుతారు. వృత్తి, వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు. ఆర్థికాభివృద్ధి సాధిస్తారు.

మకరం: కుటుంబసభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు. విలువైన వస్తువులు, వస్త్రాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. పనులు చకచకా సాగుతాయి.


కుంభం: ముఖ్యమైన పనులలో జాప్యం జరిగినా చివరికి పూర్తిచేస్తారు. ఆర్థికపరిస్థితి అంతంతమాత్రంగా ఉంటుంది. సన్నిహితుల నుంచి ఒత్తిడి ఎదురైనా అధిగమిస్తారు.

మీనం: సభలు, సమావేశాలలో పాల్గొంటారు. పాతబాకీలు వసూలవుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. ఆప్తుల నుంచి శుభవార్తలు వింటారు.

మహాభారతం

దుర్యోధనుని మూర్ఛ

ధర్మరాజుతో దుర్యోధనుడు తలపడ్డాడు. అదే తనకీ కావాలన్నట్టుగా పౌరుష ప్రతాపాలతో రెచ్చిపోయిన ధర్మరాజు, దుర్యోధనుని రథాశ్వాలను నేల కూల్చాడు. అతని సారథి శిరస్సు ఖండించాడు. కేతనాన్ని కింద పడగొట్టాడు. చేతిలోని ఖడ్గాన్ని ముక్కలు చేసి, మరిన్ని బాణాలు ఒక్కసారిగా ప్రయోగించి దుర్యోధనుణ్ణి తీవ్రంగా గాయపరిచాడు. ఆ ధాటికి ప్రాణాలు పోతాయనుకుని పరుగుదీశాడు దుర్యోధనుడు. పరుగుదీస్తోన్న దుర్యోధనుణ్ణి కాపాడదలచి ధర్మరాజుని ఎదుర్కొన్నాడు కర్ణుడు. పరుగాపి వెను తిరిగి చూశాడు దుర్యోధనుడు. ధర్మరాజుని కర్ణుడు ఎదుర్కోవడాన్ని చూసి అదే అదనుగా అక్కడున్న మరో రథాన్ని అధిరోహించి మళ్ళీ ధర్మరాజును ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యాడు దుర్యోధనుడు."సారథీ! పద! ధర్మరాజును ఎదుర్కొందాం. రథాన్ని అటు పోనీయ్" అన్నాడు. పరుగుదీసి తన వైపుగా విరిగిపడుతోన్న కెరటంలా వచ్చి పడుతోన్న దుర్యోధనుని రథాన్ని గమనించాడు ధర్మరాజు. తన రథసారథిని ఇలా హెచ్చరించాడు."దుర్యోధనుడు మళ్ళీ మన మీదికి వస్తున్నాడు. ఈసారి ఇంకా నా ప్రతాపాన్ని చూపగలగాలి. పద"అతిరథులిద్దరి మధ్యా ప్రళయ భయంకరమయిన యుద్ధం చెలరేగింది. ధర్మరాజు విల్లును రెండు ముక్కలు చేశాడు దుర్యోధనుడు. మరో విల్లు అందుకున్నాడు ధర్మరాజు. ఈసారి దుర్యోధనుని విల్లును ముక్కలు చేశాడు ధర్మరాజు. దుర్యోధనుడు మరో విల్లు అందుకున్నాడు. పుంఖానుపుంఖాలుగా బాణాల్ని వర్షించాడు. వాటిని ఆకాశంలోనే ఎదుర్కొని నేల కూల్చాడు ధర్మరాజు. మళ్ళీ మరిన్ని బాణాల్ని ప్రయోగించాడు దుర్యోధనుడు. వాటిని ఎదుర్కొనబోయేంతలోనే అవి వచ్చి ధర్మరాజుని బాగా గాయపరిచాయి. తట్టుకుని శరపరంపర కురిపించాడు ధర్మరాజు. దుర్యోధనుని అవి గాటంగా నాటుకున్నాయి. ఇద్దరూ గాయాలపాలయి నెత్తురోడుతోన్న దేహాలతో నిలిచారు. భయంకర శక్తి ప్రయోగించాడు దుర్యో



ధనుడు. దాన్ని అల్లంత దూరంలోనే డీకొని, అయిదు బాణాలను ఒక్కసారిగా ప్రయోగించాడు ధర్మరాజు. ఆ అయిదూ దుర్యోధనుని గుండెల మీద నాటుకున్నాయి. స్పృహ తప్పుతున్నట్టనిపించింది దుర్యోధనునికి. అంతలోనే తేరుకుని తొమ్మిది బాణాలను ప్రయోగిం చాడు. ఆ తొమ్మిదీ ఎంతగానో ధర్మరాజును బాధించా యి. క్షణంలో సగం సేపు కళ్ళు మూసుకుని, బాధను దిగమింగి అంతలోనే మరో బాణాన్ని ప్రయోగించాడు ధర్మరాజు. అది దుర్యోధనుని శరీరంలోంచి దూసుకు పోయింది. భరించలేకపోయాడా బాధను దుర్యోధ నుడు. ఏమయితే అదయిందని గదాయుధాన్ని తీసు కుని ధర్మరాజుని ఎదుర్కొన్నాడు. మహోగ్రశక్తితో దుర్యోధనుని నిలువరించాడు ధర్మరాజు. అప్పటికే బాగా గాయపడిన దుర్యోధనుడు స్పృహ తప్పుతున్నట్టనిపించి కళ్ళు మూసుకున్నాడు. రథాన్ని ఆనుకొని కూల బడ్డాడు. అది గమనించాడు కృతవర్మ. దుర్యోధనునికి అడ్డుగా నిలిచి ధర్మరాజును ఎదుర్కొన్నాడతను. కౌరవ వాహిని అతనికి తోడుగా నిలిచింది. దూరాన ఉన్న అర్జునుడు అది చూసి వివిధ శస్త్రాస్త్రాలు ప్రయోగించి కౌరవ వాహినిని చెల్లా చెదురు చేశాడు. అంతలో స్పృహలోకి వచ్చిన దుర్యోధనుడు, అర్జునుని ఎదుర్కొన్నాడు. గాటంగా బాణాల్ని నాటించాడు. అంతే! అర్జునుని శరపరంపరకు తిరుగులేకుండా పోయింది. అతని బాణాలకు దుర్యోధనుని విల్లు ముక్కలయింది. రథాశ్వాలు చనిపోయాయి. సారథి నేల కూలాడు. కేతనం ఎగిరి పడిందెక్కడో తెలియకుండా పోయింది. శ్వేతచ్ఛత్రం పీలికలయింది. దుర్యోధనుని ప్రాణాలు కూడా పోయేవే! అయితే ఆ బాణాన్ని అశ్వత్థామ ముక్కలు చేశాడు. అనూహ్యంగా అశ్వత్థామ ప్రవేశించడంతో అది తట్టుకోలేకపోయాడు అర్జునుడు. గురుపుత్రుని మీద బాణాలు గురిపెట్టాడు. అతని విల్లుని ముక్కలు చేశాడు. గుర్రాలను కూల్చాడు.

ఆకట్టుకున్న చిన్నారుల కోలాటాలు


మాడుగుల, న్యూస్‌లీడర్: మాడుగుల మండం ఒమ్మలి గ్రామంలో సంక్రాంతి, కనుమ పండగ సందర్భంగా మాజీ సర్పంచ్ నందారపు సన్యాశిరావు ఆధ్వర్యంలో శ్రీరాముల వారి తీర్థం సందర్భంగా జేడీపేటకు చెందిన శ్రీ దుర్గా భవాని చిన్నారుల కోలాటం అందర్ని ఆకట్టుకుంది. తీర్థం సందర్భంగా మరికొన్ని సాంస్కృతిక కార్యక్రమాలు అందర్ని అలరించాయి.



బొజ్జన్నకొండపై ఘనంగా కనుమ వేడుకలు

ప్రపంచంలో అన్నిమతాలకన్న బౌద్ధ మతం ఎంతో గొప్పది
బౌద్ధ బిక్షవు అనాలయబాంతే

అనకాపల్లి రూరల్, న్యూస్‌లీడర్:
ప్రపంచంలో అన్నిమతాలకన్న బౌద్ధ మతం ఎంతో గొప్పదని, బౌద్ధ మతంతోనే ప్రపంచ శాంతి చేకూరుతుందని బౌద్ధ బిక్షవు అనాలయ బాంతే చెప్పారు. శంకరం గ్రామంవద్దగల ప్రముఖ పర్యాటక కేంద్రం బొజ్జన్నకొండ వద్ద ప్రతీఏటా కనుమ పండగరోజు నిర్వహించే వేడుకల్లో భాగంగా ఈ ఏడాది బుధవారం ఎంతో ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో బౌద్ధ మతస్థులు, బౌద్ధ బిక్షవులు ఇక్కడకు విచ్చేశారు. అలాగే అధిక సంఖ్యలో పర్యాటకులు ఇక్కడకు విచ్చేసి సందడి చేశారు. ఇక్కడగల బౌద్ధ స్థూపంలోని బౌద్ధ బిక్షవులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ప్రపంచ శాంతి వర్ధిల్లాలి అని కోరుతూ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బౌద్ధ క్షేత్రాలను ఎక్కడా అభివృద్ధి చేయడం లేదన్నారు. దీనిపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. ప్రపంచంలో ఎంతో గొప్పదైన బౌద్ధ మతాన్ని అభివృద్ధి చేసేందుకు అందరూ ముందుకు రావాలని కోరారు. బోరా వేణుగో పాల్ మాట్లాడుతూ గౌతమ బుద్ధుడు పంచశీల మార్గాన్ని అనుసరిస్తే ప్రపంచం సుఖశాంతు లతో ఉంటుందన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ సైతం 5 లక్షల మందితో బౌద్ధ మతంలో చేరారన్నారు. బౌద్ధ మతం ఎంతో ఉన్నతమైనదన్నారు. అందరూ దీనిని అనుసరించి సుఖ శాంతులతో ఉండాలన్నారు. 7కోట్ల32 లక్షలతో బొజ్జన్న కొండను అభివృద్ధి చేస్తామని ప్రకటించిన ఇప్పటి వరకు ఎక్కడా అభివృద్ధి జరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో బౌద్ధ సంఘాల సమాఖ్య అధ్యక్షులు గొంది నవీన్, ఏయూ వైస్‌ఛాన్సలర్ కేఏ చలం, కోన వెంకటరావు, బళ్లా నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.


బొజ్జన్న కొండ చేరుకున్న పర్యాటకులు


బౌద్ధ స్థూపంవద్ద బౌద్ధ బిక్షవులు



తొమ్మిది అడుగుల ఒకే అరిటాకు పై సహ పంక్తి సంక్రాంతి భోజనం చేస్తున్న శిల్పి విల్లూరి పరమేశ్ వారి కుటుంబ సభ్యులు.
–న్యూస్‌లీడర్, అనకాపల్లి

జోన్-6 లో సమస్యలు జాస్తి

- కాలువల్లో పూడికలు తీయరు.. వీధుల్లో లైట్లు వెలిగించరు
- అవస్థలు పాలౌతున్న స్థానికులు
- ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు కోకొల్లలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని యంత్రాంగం



విశాఖపట్నం, న్యూస్‌లీడర్
జీవీఎంసీ జోన్ 6 పరిధిలోని పలు వార్డుల్లో సమస్యలు తిష్టవేశాయి. స్వంతలాభాలకు పాకులాడుతూ కొందరు అధికారులు తమ విధి నిర్వహణలో చిత్తశుద్ధిని గాలికి వదిలేసిన పాపాన ఈ జోన్‌లో ఎక్కడ చేసినా జనం అసౌక ర్యాలతో కొట్టిమిట్టాడుతున్న పరిస్థితులు ఉత్పన్నమౌ తున్నాయి. జోన్ 6లోని దాదాపు అన్ని విభాగాలకు చెందిన అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా వీధి కాలువల నిర్వహణను కూడా సక్రమంగా చేయడం లేదు. వీధుల్లోకి తడి,పొడి చెత్త సేకరణ అంటూ పారిశుధ్య కార్మికులు వచ్చి ఇంటి నుంచి చెత్త సేకరించడం తప్పా, ఇంటి పక్కనే వున్న కాలువలో పేరుకుపోయిన పూడికలు తొలగించే బాధ్యత తమదు కాదన్నట్టు పట్టించుకోకపోవడం విచారకరం. స్థానికంగా పలుకుబడి గలవారి ఇంటి ముందే శుభ్రం చేయడం, వీధుల్లో పూర్తిస్థాయిలో కాలువలను శుభ్రం చేయకపోవడం గమనార్హం. సిబ్బంది పనితీరును పర్యవేక్షించాల్సిన సంబంధిత ప్రజారోగ్యశాఖ అధికారులు సైతం పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. వీధుల్లో పారిశుధ్య పరిస్థితి ఎలా వుందో కూడా తెలుసుకొనే ఓపిక, తీరిక సంబంధిత ప్రజారోగ్యశాఖ అధికారులకు పట్టకపోవడం విచారకరం.
ఈ జోన్ పరిధిలో పలు మురికివాడ ప్రాంతాలు, మారుమూల వీధులు వుండడంతో పరిశుభ్రత లేకపోవడంతో స్థానికులు రోగాలు బారినపడుతున్నారు. దోమలు స్వైరవిహారం చేస్తూ రాత్రి వేళల్లో సైతం కునుకుతీయనీయడం లేదు. అలాగే వీధుల్లో దుర్గంధభరితమైన వాసనలు వెదజల్లుతూ స్థానికులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. దీంతో ఈ జోన్ పరిధిలోని అన్ని వార్డుల్లో పారిశుధ్య సమస్య పడకేస్తోంది. ఇదిలావుండగా వీధుల్లో కనీసం వీధిలైట్లు కూడా వెలగకపోవడం గమనార్హం. జోన్ 6 విద్యుత్ శాఖాధికారుల పర్యవేక్షణ కొరవడినట్టు తెలుస్తోంది. ఎప్పటికప్పుడు వీధి లైట్లు మొరాయించడం, రోజులు, నెలలు గడిచినా విద్యుత్ లైట్లును అమర్చకుండా కుంటిసాకులు చెబుతూ జీవీఎంసీ విద్యుత్‌శాఖాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. వీధిలో ఎక్కడైనా విద్యుత్ దీపం వెలగలేదని ఫిర్యాదు వెళ్లినా అధికారులు, సిబ్బంది నుండి స్పందన వుండడం లేదని పలువురు వాపోతు న్నారు. ఫలితంగా పలు వీధులు చీకటిమయం అవుతున్నాయి. రాత్రి వేళల్లో పలు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. మరో వైపు ఈ జోన్ పరిధిలో అక్రమ నిర్మాణాలు కూడా జోరందుకున్నాయి. టౌన్‌ప్లానింగ్ అనుమతులు లేకుండానే పెద్ద ఎత్తున అనధికార నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ, జోన్ 6 టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది కనుసన్నల్లోనే ఆయా నిర్మాణాలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. లక్షలాది రూపాయలు సొమ్ములు దండుకొని పలువురు టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది తిన్నంటి వాసాలు లెక్కపెడు తున్నారని, ఫలితంగా జీవీఎంసీ ఆదాయానికి గండి పడడంతో పాటు, అక్రమనిర్మాణదారులకు కొమ్ము కాస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. అలాగే ఫించన్ల విషయంలో కూడా యూసీడీ అధికారులు అర్హులను కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటూ, అనర్హులను లబ్ధిదారులుగా యూసీడీ అధికారులు ఎంపిక చేస్తున్నట్టు విమర్శలున్నాయి. ఇలా జీవీఎంసీ జోన్ 6లో ప్రతి విభాగం అధికారులు నిర్లక్ష్యవైఖరితో వ్యవహరిస్తూ జోన్‌లో ప్రజలకు ఇబ్బందులు పాలుచేస్తున్నట్టు జనం వాపోతున్నారు. జీవీఎంసీ కమిషనర్ హరినారాయణన్ స్పందించి జోన్ 6 పై దృష్టిసారించాలని, ఇక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యవైఖరి ప్రదర్శించడంతో పాటు, అక్రమాలకు కొమ్ముకాస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.





యువత గోపీని ఆదర్శంగా తీసుకోవాలి

మాజీ మంత్రి దాడి వీరభద్రరావు


పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి దాడి వీరభద్రరావు

అనకాపల్లి టౌన్, న్యూస్‌లీడర్:
సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రముఖ వ్యాపారవేత్త కొణతాల గోపీకృష్ణ జన్మదిన సందర్భంగా గవరపాలెం పెదరామస్వామి ఆలయ కళ్యాణమండపం వద్ద పేద మహిళలకు, వృద్ధులకు మాజీ మంత్రి దాడి వీరభద్రరావు చేతుల మీదుగా చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్మదిన సందర్భంగా అనవసర ఆర్బాటాలకు పోకుండా ఇటువంటి సేవా కార్యక్రమాలను చేపడుతున్న గోపీని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గత 15 ఏళ్లగా తన పుట్టినరోజును పురస్కరించుకొని విలువైన చీరలను పంపిణీ చేయడం అభినందించదగ్గ విషయమని దాడి వీరభద్రరావు అన్నారు. ప్రముఖ సినీ నటుడు పి.విజయబాబు మాట్లాడుతూ తన స్నేహితుడు పుట్టిన రోజున జరుపుకుంటున్న ఇటువంటి సేవా కార్యక్రమంలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. గోపీ నేను చిన్ననాటి స్నేహితులమని ఈ సందర్భంగా విజయబాబు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ రైతు సమాఖ్య అధ్యక్షులు దాడి రత్నాకర్, దాడి జయవీర్, మాజీ కౌన్సిలర్ కర్రి శివనారాయణ, పీవీ రమణ, దాడి అభిమానులు, జయవీర్ మిత్రమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ముందుగా కార్యక్రమానికి విచ్చేసిన వారంతా జన్మదిన శుభాకాంక్షలు గోపీకి తెలిపారు. సుమారుగా 2 వేల మందికి చీరలు పంపిణీ చేశారు.

యాగాలతో సమాజంలో శాంతి

ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ


అనకాపల్లి టౌన్, న్యూస్‌లీడర్: యాగాలతో సమాజంలో శాంతి చేకూరుతుందని స్థానిక ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ తెలిపారు. పట్టణంలో గవరపాలెం శ్రీ గౌరీ సేవా సంఘం వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 2 వ తేదీ వరకు గౌరీ పంచాయతన దేవాలయంలో మహా శౌరయాగ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. శౌరయాగానికి జరుగుతున్న పనులను కమిటీ ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఏర్పాట్లపై అర్చక ఎగ్జామినర్ బంకుపల్లి సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గౌరీ సేవా సంఘం అధ్యక్షులు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, బుద్ద రమణాజీ, పెంటకోట సుబ్రహ్మణ్యం, బుద్ద భాస్కరరావు, యల్లపు వెంకటరమణ, మళ్ల సూర్యప్రకాషరావు, అర్బన్ జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు మళ్ల సురేంద్ర, కొణతాల రాము తదితరులు పాల్గొన్నారు.


శౌరయాగ పంచాయతన మహాయాగ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే పీలా

ప్రముఖ వైద్యులు సూర్యనారాయణ మృతికి నివాళి

అనకాపల్లి, న్యూస్‌లీడర్: ప్రముఖ వైద్యులు, రిటైర్డ్ ప్రొఫెసర్ డి.సూర్యనారాయణ మృతికి అనకాపల్లి శిష్ట కరణ సమితి ప్రతినిధులు అనకాపల్లిలో శ్రద్ధాంజలి ఘటించారు. అలాగే ఆయన కుటుంబానికి సంతాపం తెలియజేశారు. సూర్యనారాయణ సమితి ముఖ్య సలహాదారుగా వ్యవహరించేవారని, ఆయన అందించిన సేవలు మరువలేనివని, ఆయన మరణం సమితికి తీరని లోటన్నారు. ఈ సందర్భంగా ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమితి గౌరవ అధ్యక్షులు ఎం.మాధవరావు, కార్యదర్శి బి.ఉమామహేశ్వరరావు, సమితి ప్రచారక్ ఎన్.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీ కొని మహిళకు తీవ్రగాయాలు



కశింకోట, న్యూస్‌లీడర్:
బైక్‌ను లారీ ఢీ కొన్న సంఘటనలో ఒక మహిళకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో బైక్‌పై వెనుక కూర్చున్న మహిళకు రెండు కాళ్లు నుజ్జు నుజ్జు అయ్యాయి. గాయాలైన మహిళ బంధువులు అందించిన సంఘటన వివరాలిలా ఉన్నాయి. బుధవారం కొలంశెట్టి త్రివేణి(30) గాజువాక నుంచి బైక్‌పై కశింకోట వారి బంధువుల ఇంటికి తన భర్తతో వస్తుంది. అయితే పిసినికాడ సమీపంలో వెనుక నుంచి వస్తున్న లారీ బైక్‌ను ఢీ కొనడంతో వెనుక కూర్చున్న త్రివేణి కిందపడిపోయింది. దీంతో త్రివేణి రెండుకాళ్లు నుజ్జు నుజ్జు అయ్యాయని బంధువులు తెలిపారు. ఈ మేరకు త్రివేణిని అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించగా ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి

విశాఖ రైతు సమాఖ్య అధ్యక్షులు దాడి రత్నాకర్


రత్నాకర్‌కు మెమొంటో అందజేస్తున్న దృశ్యం

అనకాపల్లి రూరల్, న్యూస్‌లీడర్:
అనాధిగా వస్తున్న మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత, అవసరం మనందరిపై ఉందని విశాఖ రైతు సమాఖ్య అధ్యక్షులు దాడి రత్నాకర్ అన్నారు. మండలంలోని సీతానగరంలో గ్రామంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా గ్రామంలోని రామాలయంలో దర్శనం చేసుకున్నారు. గ్రామానికి విచ్చేసిన రత్నాకర్‌ను గ్రామస్థులు సాదరంగా ఆహ్వానించారు. శాలువాతో సత్కరించి మెమొంటో అందజేశారు. అనంతరం ఇక్కడ నిర్వహించిన సంబరాల్లో భాగంగా ఇక్కడ నిర్వహించిన శ్రీరామువారి తీర్థ మహొత్సవంలో రత్నాకర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గంగుపాం మహేష్, సుంకర చంటి, బొడ్డపాటి చినరాజారావు, నందవరపు కుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి వేడుకలు

మునగపాక, న్యూస్‌లీడర్:
మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సంబరాల్లో భాగంగా మునగపాకలో ఎడ్లబండ్ల పోటీలు, గుర్రపు పరుగు పందెం పోటీలు నిర్వహించారు. అలాగే పలు గ్రామాల్లో మహిళలకు ముగ్గులు పోటీలు, వివిధ రకాల పోటీలు నిర్వహించారు. ఈ సంబరాల్లో పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే పాటిపల్లి గ్రామంలో స్పందించే హృదయంలో చారిటబుల్ ట్రస్టువారి ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ ఆడారి అప్పలనాయుడు జ్ఞాపకార్థం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాల్లో చిన్నారులు చేసిన నృత్యాలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎన్ఆర్ఐ ఆడారి ఆదిబాబు, ట్రస్టు ప్రతినిధి ఏవీఎన్ మూర్తిలు మాట్లాడుతూ మన సంస్కృతిని, ఆచారాలను కాపాడుకొనేందుకు ఇటువంటి సంబరాలు జరుపుకోవడం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో డార్టర్ ఏఏ నాయుడు, డాక్టర్ ఎ.రామమోహనరావు, కేవీ రమణ, మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్, గ్రామస్థులు పాల్గొన్నారు.


పాటిపల్లిలో నృత్యాలు చేస్తున్న చిన్నారులు

పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ

కశింకోట, న్యూస్‌లీడర్:
కశింకోట గవరపేట శ్రీ పవర్ వినాయఖ సేవా సంఘం ఆధ్వర్యంలో గత 10 సంవత్సరాల నుంచి వృద్దులకు, మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ కార్యక్రమం చేపడుతున్నామని పవర్ వినాయక సేవా సంఘం అధ్యక్షులు భీమరశెట్టి ముసిలినాయుడు తెలిపారు. దీనిలో భాగంగా సంక్రాంతి పండగను పురస్కరించుకొని మంగళవారం సుమారు 100 మందికి భీమిశెట్టి శ్రీనివాసరావు చేతులమీదుగా చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సంఘం స్థాపించినప్పటి నుంచి ప్రతీఏటా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని ముసిలినాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డ్రాయింగ్ ఉపాధ్యాయుడు, ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, పెంటకోట సత్యనారాయణ, కో–ఆపరేటివ్ బ్యాంకు మాజీ డైరెక్టర్ పెంటకోట నాగేశ్వరావు, మహిళలు తదితరులు పాల్గొన్నారు


పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

మునగపాకలో... మండలంలోని నాగులాపల్లి గ్రామంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. మళ్ల రామునాయుడు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ పంపిణీ కార్యక్రమం చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా సంక్రాంతికి పేదలకు ఈ కార్యక్రమం చేపడుతున్నామని ట్రస్టు చైర్మన్ మళ్ల కాశేశ్వరరావు అనూరాధలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మళ్ల సూరిఅప్పారావు, మళ్ల నారాయణమూర్తి, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.


నాగులాపల్లిలో చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఘనంగా అచ్చమ్మ పేరంటాళ తీర్థం


బంగారుమెట్టలో తీర్థం

బుచ్చెయ్యపేట, న్యూస్‌లీడర్:
సంక్రాంతి సందడితో గ్రామాలు కళకళ లాడుతున్నాయి.సుదూర ప్రాంతాలకు వలస పోయిన వారంతా స్వగ్రామాలకు వచ్చి కుటుంబ సభ్యులు, బందుమిత్రులతో కలిసి సంక్రాంతి వేడుకలలో పాల్గొన్నారు. తమ పూర్వీకులకు బట్టలు పెట్టి పూజలు చేశారు. గ్రామాల్లోని ఇళ్లన్నీ కొత్త అల్లుళ్ల, బందుమిత్రులతో సందడిగా ఉన్నాయి. సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీక నిలిచే తీర్థాల సందడి ప్రారంభమైంది. మంగళవారం బంగారుమెట్టలో అచ్చమ్మపేరంటాళ తీర్థం ఘనంగా జరిగింది. ప్రతి ఏటా ఈ తీర్థం ఘనంగా నిర్వహిస్తారు.ఈ ఏడాది కూడా పరిసర గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ తీర్థానికి తరలివచ్చి అమ్మవారికి పూజలు జరిపారు.ఈ సందర్భంగా ఎడ్ల పరుగు పందెం, ఉట్టి కొట్టే పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీలు తిలకించడానికి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

చంద్రబాబువి బూటకపు హామీలు

గొలుగొండ, న్యూస్‌లీడర్
చంద్రబాబు హామీలన్ని బూటకపు హామీలని సిపిఐ మండల కార్యదర్శి నల్లబెల్లి శ్రీనివాసరావు విమర్శించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు మరచి ప్రస్తుతం లేనిపోని హామీలు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. 2014లో ఇచ్చిన హామీలు ఇప్పటికీ నెరవేర్చలేదన్నారు. పింఛన్ల పెంపు కూడా ఎన్నికల వల్లేనన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు



యలమంచిలి, న్యూస్‌లీడర్:
తెలుగు రాష్ట్ర ప్రజలకు అతి పెద్ద పండుగైన సంక్రాంతి పండుగ గ్రామాల్లో ప్రతి ఉత్సాహంగా జరుపుకున్నారు. పంట పండి ఇంటికి వచ్చాక మొదటిసారిగా వచ్చే పండగ సంక్రాంతి కావడంతో కొత్త బియ్యంతో ప్రసాదం, బియ్యం అటుకులు, కొత్త బెల్లం, ప్రసాదాలతో దేవున్ని పూజిస్తారు. ఇదే వరుసలో మృతి చెందిన పెద్దలను తలుచుకుంటూ కొత్త బట్టలు పెద్దలకు పెట్టి పూజించి వారి జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడం ఆనవాయితీ. ఈ సంక్రాంతి పండుగను పురస్కరించుకొని, గ్రామంలో గల దేవాలయాల వద్ద సాంస్కృతిక కళలను ప్రదర్శిస్తూ చూపరులను ఆకట్టుకునే విధంగా చేయటం గ్రామాల్లో ఈ పండగలో మరో సందడిగా కనిపిస్తుంది, అతివలకు ముగ్గులు పోటీలు. కుర్చీ ఆట, తగ్గావా, రన్నింగ్, సో సైకిలింగ్ తదితర ఉత్సాహ వంతమైనఆటలు ఆడించి అందర్నీ సంతోష పెట్టే పండుగ సంక్రాంతి పండుగ, మున్సిపాలిటీలో కొత్త పాలెం గ్రామంలో శివాలయం వద్ద గ్రామ పెద్ద ఆడారి సత్యనారాయణ తీర్థం సంక్రాంతి రోజునే జరగటం, ఈ తీర్థంకి, చిటికెలు, చెట్టు భజనలు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సాహ భరితంగా జరిగింది. ఆటల పోటీల్లో గెలుపొందినవారికి, ప్రోత్సాహక బహుమతులు నిర్వహకులు ఏవి రెడ్ నాయుడు కుటుంబ సభ్యులు అందజేశారు.

సమస్యల పరిష్కారం కోరుతూ ఎమ్మెల్యేకి వినతి

రావికమతం, న్యూస్‌లీడర్: మండల కేంద్రంలో దీర్ఘకాలికంగా నెలకొన్న సామాజిక సమస్యలు పరిష్కరించాలని జనసేన పార్టీ కార్యకర్తలు చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజుకు వినతిపత్రం అందజేశారు. పరదేశమ్మ గుడికి పక్కా రహదారి నిర్మాణం, జూనియర్ కాలేజి ఏర్పాటు, ఆర్టీసి బస్‌షెల్టర్, పెద్దిరాజు చెరువు కట్టపై ఆనకట్ట నిర్మాణం తదితర పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి.రామారావు, డి.గోవింద, డి.మణికంఠ పాల్గొన్నారు.

రైతుల దరిచేరని 'సంక్షేమం'

* ఫసల్ బీమాపై అవగాహన శూన్యం
* తగ్గిన ప్రీమియం, పెరిగిన పంట విలువ

రావికమతం, న్యూస్‌లీడర్

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు రైతుల దగ్గరకు చేరడం లేదు. పథకాలపై అవగాహన కల్పించాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఉదాహరణకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్ బీమా(పిఎంఎఫ్‌బివై) పథకం రైతులకు ఎంతో ప్రయోజనకరం. ప్రకృతి వైపరీత్యాల్లో పంటలు పండక, పండినా చేతికందక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గతంలో కన్నా ఈ ఏడాది రైతులు చెల్లించాల్సిన ప్రీమియం తగ్గించారు. దీనికి తోడు పంట విలువను పెంచారు. వ్యవసాయాధికారులు గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి విస్తృతంగా ప్రచారం చేయాలి. కానీ మండలంలో ఆ దిశగా అధికారులు తీసుకున్న చర్యలు ఎక్కడా కానరాలేదు.రైతులు సాగు చేసిన పంటను గ్రామాన్ని ఆధారంగా తీసుకొని పథకాన్ని అమలు చేస్తారు. అతివృష్టి, అనావృష్టి, పిడుగుపాడు, గాలివాన, తుపాన్ పంటలు మునిగిపోవటం, తెగుళ్ల ద్వారా జరిగిన నష్టాలను అంచనా వేసి పరిహారాన్ని చెల్లిస్తారు. ప్రధాన పంటలకు ప్రతికూల వాతావరణం వలన సాగు చేయకపోవడం, నాట్లు వేయకపోవడం వలన జరిగే ఆర్థిక నష్టాలకుబీమా మొత్తంలో 25 శాతం చెల్లిస్తారు. నీట మునిగిపోవడం, వడగడ్ల వాన వలన నష్టపోయిన పంటకు అంచనా వేసి నష్టపరిహారం చెల్లిస్తారు. పంట మధ్య కాలంలో నష్టపోతే మొత్తం పరిహారంలో వెంటనే 25శాతం చెల్లిస్తారు. పంట కోత తర్వాత పొలంలో అరబెట్టిన పంటలకు 14 రోజుల వరకు తుపాన్, వర్షాలతో నష్టం జరిగితే నష్టపరిహారం అందజేస్తారు.



నీట మునిగిన వరి పంట

కానీ ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టకపోవడం బాధాకరం. ఫసల్ బీమా పథకం గురించి తెలియకపోవడంతో రైతులెవరూ బీమా చేసుకోలేదు. అధికారులు అవగాహన కల్పించి ఉంటే రైతులకు కొంత మేర ప్రయోజనం చేకూరేది.

ఐక్యతకు ప్రతిరూపాలు గాలిపటాలు

జాతీయ అవార్డు గ్రహీత రవికుమార్



విశాఖపట్నం, న్యూస్‌లీడర్: జాతీయ యువజనోత్సవాల్లో భాగంగా నెహ్రూ యువ కేంద్రం శ్రీ గాయాత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమి సంయుక్త నిర్వహణతో గాలి పటాటల పండగ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్ రవికుమార్ గాలిపటాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయోభేదం లేకుండా ఐక్యతగా ఈ పండగ జరుపుకున్నారన్నారు. భారతదేశం సంప్రదాయాలు, సంస్కృతిక పెద్ద పీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ క్రీడాకారిణి ఎస్ శ్రీలక్ష్మి, మహేష్, అన్నపూర్ణ, మైథిలి, కాత్య రక్షిత శ్రీహరి, దేవి, రమణ, డాక్టర్ ఎస్ఎల్ నారాయణ డాక్టర్ లక్ష్మణరావు గొలగాలి శ్రీను, తనిక్క్, మెలోడి సత్య శ్రీనివాస్ ఎం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పేదలకు చీరలు పంపిణీ

గాజువాక, న్యూస్‌లీడర్: మాజీ మంత్రి గుడివాడ గుర్నాథరావు మోమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు చీరలు పంపిణీ చేశారు. అక్కిరెడ్డిపాలెంలో నిర్వహించిన గుడివాడ రమాబాయి స్మరకార్ధం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పేదలకు చీరలతో పాటు నిత్యవసర సరకులు అందజేశారు. ఈ సందర్భంగా గుడివాడ లతీష్ చిట్టిబాబు మాట్లాడుతూ గుడివాడ గుర్నాథరావు మోమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సేవాకార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే అక్కిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన వందమంది పేదలకు చీరలు, నిత్యవసర సరకులు పంపిణీ చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంద్ర నూకరాజు జోషప్, ఎ శ్రీనివాస్, ఈటి సురేష్, ఆర్ చిట్టిబాబు, ఆర్ వెంకట్రావు, జి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆటల పోటీల విజేతలకు బహుమతులు

మాడుగుల, న్యూస్‌లీడర్: చింతలూరు గ్రామంలో గౌరీ మినరల్స్ అధినేత ఏబీఎల్ తయారు, రాజేష్, వీరేష్ రవీంద్ర ఆధ్వర్యంలో సంక్రాంతి పండగ సందర్భంగా పలు రకాల సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌరీ మినరల్స్ సంస్థ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. పాటల పోటీలకు 3 ప్రైజ్‌లు, ముగ్గుల పోటీలకు మూడు ప్రైజ్‌లు కుర్చీ పోటీకలు 3 ప్రైజ్‌లు,మహిళల కబడ్డీ పోటీలకు 2 ప్రైజ్‌లు, పురుషుల జూనియర్ కబడ్డీ పోటీలకు 2 ప్రైజ్‌లు, పురుషుల సీనియర్ కబడ్డీ పోటీలకు 2 ప్రైజ్‌లు గౌరీ మినరల్స్ అధినేతలు అందించారు. కోలాటం, నేల వేషాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాళంగి కల్యాణరాజు, కాళంగి పెదబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



దివ్యాంగ పిల్లలకు సాయం



అచ్యుతాపురం, న్యూస్‌లీడర్: అచ్యుతాపురం స్థానిక మండల కేంద్రంలో మకర సంక్రాంతి సందర్భంగా కొండకర్ల ఇచ్చా ఫౌండేషన్ దివ్యాంగుల పిల్లలను అచ్యుతాపురం పోలీస్ స్టేషన్ ఎస్సై తారకేశ్వరరావు పోలీస్ సిబ్బంది సందర్శించారు. దివ్యాంగ పిల్లలతో ముచ్చటించారు. పండగ వాతావరణం కనిపించే విధంగా దివ్యాంగుల పిల్లల్లో ఆనందం చూసారు. ఈ సందర్భంగా బియ్యం బ్యాగులు మూడు, 10 కేజీలు కందిపప్పు విద్యార్థులకు అవసరాలకు నిమిత్తం సబ్బులు, ఆయిల్, షాంపులు కొనుగోలు చేసేందుకు రూ. 3500 అందించారు. అనంతరం దివ్యాంగుల విద్యార్థులతో ఎస్సై తారకేశ్వరరావు, అదనపు ఎస్సై మల్లేశ్వరరావు, ట్రైనింగ్ ఎస్సైలు ఏ టాటా ఉపేంద్రనాథ్, ఏఎస్సై సత్యనారాయణ పిల్లల్లో సంక్రాంతి పండగ సంతోషాలను చూశారు.

రహదారికి మోక్షం

నాతవరం, న్యూస్‌లీడర్

మండలంలోని సరుగుడు పంచాయతీ కొండపై గల సుందరకోట, అసనగిరి, కొత్తదద్దుగుల తదితర గిరిజన గ్రామాలకు రహదారి మోక్షం కలగనుంది. ఐదు కోట్ల రూపాయలతో రోడ్డు పనులు పూర్తవుతుండటంతో వీరిలో ఆనందం వెల్లువిరుస్తోంది. స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి నేటి వరకు సరుగుడు పంచాయతీలో కొండ మీద గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు మంత్రి అయ్యన్న కృషి మేరకు ఈ రోడ్డు పనులు జరిగాయి.

మొరాయిస్తున్న బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్

చింతపల్లి, న్యూస్‌లీడర్

చింతపల్లి సెల్‌ఫోన్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక వైపు బిఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ మొరాయిస్తుంటే మరో వైపు జియో సేవలు అందుబాటులోకి రావడం లేదు. చింతపల్లి మండలంలో బిఎస్ఎన్ఎల్ నెట్ వర్కు మాత్రమే వినియోగదారులకు అందుబాటులో ఉంది. ప్రతీ రోజు బిఎస్ఎన్ఎల్ టవర్ పరిధిలో 12లక్షలకు పైగా ఇన్‌కమింగ్, అవుట్ గోయింగ్ కాల్స్ వెళ్తున్నాయి. డిమాండ్‌కు తగినట్టుగా సిగ్నల్స్ ఫ్రీక్వెన్సీని బిఎస్ఎన్ఎల్ అధికారులు పెంచడం లేదు. దీంతో తరచూ సెల్‌సిగ్నల్స్ అందక వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పట్టణంలో ఎనిమిది నెలల క్రితం జియో కంపెనీ రెండు సెల్ టవర్లను నిర్మించింది. ప్రస్తుతం జియో ఓఎఫ్‌సి కేబుల్ నిర్మాణం జరుగుతున్నాయి. జియో సేవలు అందుబాటులోకి రావాలంటే మరో రెండు నెలలు వేచి చూడాల్సిందే. అయితే బిఎస్ఎన్ఎల్ అధికారులు నాణ్యమైన సేవలందించడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. కాల్స్‌లోనూ నాణ్యతలేదు. ఒకరి మాట మరొకరికి స్పష్టంగా వినిపించడం లేదు. ఇంటర్నెట్ సేవలు పూర్తిగా అస్తవ్యస్తంగా ఉంటున్నాయి. సెల్‌లో డేటా అన్ అయినట్లు కనిపించినా ఇంటర్నెట్ పని చేయడం లేదు. బిఎస్ఎన్ఎల్ అధికారులు స్పందించి సెల్ సాంకేతాలు నాణ్యతను మెరుగుపర్చాలని వినియోగదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మంటకలిసిన మానవత్వం

విశాఖపట్నం, న్యూస్‌లీడర్: రెండు రోజుల పసికందును గొంతు కోసి, నిర్లాక్ష్యంగా చెత్తకుప్పలలో పడేసిన దోషులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని సీడ్ ఛైల్డలైన్ 1098, కోరుతుంది. వివరాల్లోకి వెళితే మంగళవారం 11గంటల సమయంలో ఎంవీపీ కోలనీ టూరిజం అతిథిగృహం సమీపంలో ముళ్ళకంచలలో గుర్తు తెలియని వ్యక్తులు రెండు రోజుల ఆడబిడ్డను గొంతుకోసి పడేసి పోగా ఆపసిబిడ్డను గుర్తించిన స్థానికులు ఆకుల శ్రీనివాసరావు మానవత్వంతో ఆబిడ్డను కెజిహెచ్‌లో చికిత్స నిమిత్తం చేర్పించారు. ఛైల్డవెల్ఫేర్ కమిటీ ఛైరపర్సన్ శ్యామలారాణి మరియు ఎంవీపీ పోలీసులు ద్వారా సమాచారం అందుకున్న చైల్డ్ లైన్ 1098 సబ్యులు హుటాహుటిన కెజిహెచ్ చేరుకుని జిల్లా మహిళా శిశు అభివృద్ధి సంస్తకు చెందిన సఖి వన్ స్టాప్ సెంటర్ వారి సహకారంతో బిడ్డకు అండగా నిలిచింది కెజిహెచ్ వైద్యులు బిడ్డకు వైద్యం అందిస్తున్నారు. బిడ్డను మళ్ళకంచలలో పడేయడమే కాకుండా బ్లేడుతో గొంతు కోసి చంపేయలని చూసిన వారిని గుర్తించి వారిపై ఛైర్యతీసుకోవాలని ఈ సందర్భంగా చైల్డ్ లైన్ 1098 కోరుతున్నారు. వైద్య పరీక్షలనంతరం బిడ్డ పూర్తి ఆరోగ్యంగా ఉన్న తరువాత సీడబ్ల్యుసీ వారి ఆదేశాలు మేరకు విశాఖ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న శిశు గృహంలో చేర్చడం జరుగుతుంది. ఈ సందర్భంగా విశాఖ చైల్డ్ లైన్ 1098 జిల్లా కోఆర్డినేటర్ జి.డేవిడ్ రాజు మాట్లాడుతూ తల్లి కడుపులో పడ్డ మరుక్షణం నుంచి బాలల హక్కులు వర్తిస్తాయనీ, పసిబిడ్డలను అనాదులగా వదిలివేయడం, చెత్తకుప్పల పాలు చేయడం, కుక్కల పందుల పాలు చేయడం చంపాలని చూడడం నేరమని, పిల్లలు అక్కర్లేదు అనుకునేవారు ఉచిత 1098కి ఫోన్ చేసి సమాచారం ఇస్తే ఆ సమాచారాన్ని గోప్యంగా ఉంచి ఆ పిల్లలును రక్షించి, ప్రభుత్వ నియమ నిబంధనలు మేరకు సీడబ్ల్యుసీ ద్వారా మహిళశిశు సంక్షేమ శాఖ ద్వారా పిల్లలు లేని దరఖాస్తు చేసుకున్న దంపతులుకు దత్తత ఇచ్చే అవకాశం ఉందని తెలియజేసారు.



కాల చక్రంలో కనుమరుగవుతున్న జట్కా బండి

కోటబొమ్మాళి, న్యూస్‌లీడర్ : రాజుల కాలంలో ఉన్న రధాలు, గుర్రాలు, జమీందార్ల కాలం నాటి గూడు బళ్లు, జట్కా బళ్లు అంతరించి నేడు కాలచక్రంలో కనుమరుగవు తున్నాయి. నేటి కాలంలో అత్యంత వేగంగా పయనించే బస్సులు, ఆటోలు, కార్లు ప్రదాన ప్రయాణ సాదనాలుగా మారాయి. అయినప్పటికీ కొన్ని చోట్ల గుర్రంతో నడిచే జట్కా బళ్లు ప్రయాణ సాదనాలుగా నేడు కనిపించడం విశేషం. ముఖ్యంగా కోటబొమ్మాళి మండలం తిలారు, నారాయణవలస, జలుమూరు మండలం, పెద్దదూగాం, చిన్నదూగాం గ్రామాలకు చెందిన కొన్ని కుటుంబాలు వేరే వృత్తి చేపట్టలేక బ్రతుకు జట్కా బండిగానే జీవనం సాగిస్తున్నారు. చల్లపేట జంక్షన్ నుండి తిలారు రైల్వే స్టేషన్ వరకు నడిపే ఈ జట్కా బళ్లుపై ఎక్కి ప్రయాణం చేయడమంటే ఇప్పటికీ కొంత మందికి సరదాగానే ఉంటుంది. కానీ జట్కా నడిపే యాజమానికే రోజంతా కష్టపడినా పూట గడవని పరిస్దితితో జీవిస్తున్నారు. వేలాది రూపాయిల వ్యయంతో గుర్రాన్ని కొని దానికి తర్ఫీదు ఇచ్చి జట్కా బండి నడుపుతున్నామని, గుర్రానికి గ్రాసం కూడా వేయలేని దుస్దితిలో ఉన్నామని జట్కా వారు తెలిపారు. తరతరాల నుండి సంక్రమించిన ఈ జట్కా బండి వృత్తిని వీడలేక, మరో వృత్తిపై నైపుణ్యం లేక బతుకుతున్నామని ఆవేదనను వ్యక్తం చేసారు. ఈ జట్కా బళ్లు వల్ల వాయు కాలుష్యం ఉండకుండా ఇందనాలు పోదుపు అవుతున్నా ప్రభుత్వాలు, పాలకులు తమను అబినందించాల్సింది పోయి తమను పట్టించుకోవడం లేదని వారు వాపోయారు. తమ దుస్దితి పట్ల ప్రభుత్వం స్పందించి సంక్షేమ పథకాలు అమలు చేసి ఆర్ధికంగా ఆదుకోవాలని జట్కాదారులు కోరుతున్నారు.



తిలారు నుండి నడుపుతున్న జట్కా బండి

ఫకీర్ కుటుంబానికి రూ. 10 లక్షల పరిహారం చెల్లించాలి

చైతన్య సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణ

పార్వతీపురం న్యూస్‌లీడర్

అడవి ఏనుగుల దాడిలో ఇటీవల మృతి చెందిన నిమ్మక పకీరు కుటుంబానికి తక్షణమే 10 లక్షల పరిహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ ఆదివాసి చైతన్య సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు అరిక సూర్యనారాయణ ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లా డుతూ విజయనగరం. శ్రీకాకుళం జిల్లాలో ఆదివాసి మైదాన ప్రాంతాలలో అడవి ఏనుగుల గుంపు సంవత్సరాల నుండి సంచరిస్తున్న ప్పటికీ శాశ్వతంగా పంపించుటకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. ఈ రెండు జిల్లాల్లోవేలాది ఎకరాల పంటలు. ప్రాణనష్టం జరుగుతున్నప్పటికీ పట్టించుకోకుండా ఫారెస్ట్ అధికారులు. పోలీస్ రెవెన్యూఅధికారులు ఏనుగుల వెనకాల తిరుగుతున్నారు తప్ప చేసింది ఏమీ లేదని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయనకోరారు.



జీవీఎంసీ 66వార్డ్ కొత్తపాలెం శ్రీ గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో సంక్రాతి ముగ్గులు పోటీలు గెలుపొందిన మహిళా లకు బహుమతులు ప్రదానం కార్యక్రమంలో పాల్గొన్న సంఘం సభ్యులు. సంఘం ప్రెసిడెంట్ పి రమేష్ సెక్రెటరీ ఎస్ రవి వైస్ ప్రెసిడెంట్ ఎమ్ అచ్యుతారావు సంఘం మాజీ ప్రెసిడెంట్ దాడి వెంకట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

–న్యూస్‌లీడర్, విశాఖపట్నం

పాడి రైతులకు అండగా హెరిటేజ్ డైరీ : మేనేజర్ శేషు

అచ్యుతాపురం, న్యూస్‌లీడర్ : స్థానిక మండల కేంద్రం వెదురువాడ గ్రామంలో పాడి రైతులకు అండగా ఉంటా ము హెరిటేజ్ డైరీ మేనేజర్ శేషు తెలిపారు పాడి రైతులకు 40. మందికి. రూ.2.10 బోనస్ హెరిటేజ్ డైరీ మేనేజర్ కూంద్రపు శేషు అందించారు సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ హెరిటేజ్ డైరీ పాడి రైతు లకు అన్ని సౌకర్యాలతో పాటు రైతులకు అండగా ఉంటా మని విద్యార్థులకు ఉన్నతమైన విద్య తో పాటు వై ద్యం అందిస్తామన్నారు పాడి రైతు పేద పిల్లలకు అన్ని విధాలుగా ఆదుకుంటామని హెరిటేజ్ డైరీ మేనేజర్ శేషు అన్నారు జిల్లా లో అన్ని డైరీ కంటే అధిక రేట్లు ఇస్తూ రైతులకు ఎల్లప్పుడూ అండగా హెరిటేజ్ డైరీ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి సాయి రాజ్ బి మధు రాజ్. కె శ్రీనివాసరావు కే అప్పారావు బి. నరసింగరాజు కుమారి రాజు తదితరులు పాల్గొన్నారు



ఘనంగా కోడి రామ్మూర్తి జయంతి




శ్రీకాకుళం, న్యూస్‌లీడర్: ఇండియన్ హెర్క్యూలియస్, కలియుగ భీముడు, శాండో బిరుదాంకితులు కోడి రామమూర్తి జయంతిని సోమవారం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక కోడి రామమూర్తి స్టేడియం వద్దగల కోడి రామ్మూర్తి విగ్రహానికి జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి బి.శ్రీనివాస కుమార్, రిమ్స్ వైద్య కళాశాల ఫిజికల్ డైరెక్టర్ జగన్నాథరావు, ఆర్ట్స్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మోహన్ రాజు, స్టార్ వాకర్స్ క్లబ్ మాజీ గవర్నర్ మరియు ఆర్ట్స్ కళాశాల విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ గేదెల ఇందిరా ప్రసాద్ తదితరులు కోడి రామమూర్తి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఖండాంతరాల్లో ఖ్యాతిని ఆర్జించిన కోడిరామమూర్తిని స్ఫూర్తిగా తీసుకోవాలని డి.ఎస్.డి.ఓ శ్రీనివాస కుమార్ పిలుపునిచ్చారు. క్రీడాకారులు మంచి తర్ఫీదు పొందాలని, మంచి శారీరక ధృడత్వాన్ని కలిగి ఉండి నైపుణ్యాలను పొందాలని అన్నారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించుటకు అన్ని అవకాశాలు ఉన్నాయని వాటిని వినియోగించుకోవాలని ఆయన కోరారు. అంతకముందు సాంప్రదాయ భోగీ మంటలను వేసారు. ఈ కార్యక్రమంలో క్రీడా ప్రాధికార సంస్థ బాక్సింగు శిక్షకులు మాణిక్యం ఉమామహేశ్వర రావు, బాస్కెట్ బాల్ శిక్షకులు అర్జున రెడ్డి, కబడ్డీ శిక్షకులు సింహాచలం, హాకీ శిక్షకులు బాలు, స్టార్ వాకర్స్ ప్రతినిధులు బి.వి.రవిశంకర్, ఎస్.జోగినాయుడు, బాడీ బిల్డర్స్ గౌరి శంకర్ నేతృత్వంలోని బృందం, జిమ్ శిక్షకులు సూరి నేతృత్వంలోని సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఏరో స్పోర్ట్సు ఫెస్ట్

సీతంపేట, న్యూస్‌లీడర్: శ్రీకాకుళం జిల్లా సీతంపేటలో నిర్వహిస్తున్న ఏరో స్పోర్ట్సు ఫెస్టివల్‌కు ఆదరణ పెరిగింది. సంక్రాంతి సెలవులు కావడంతో స్వగ్రామాలకు విచ్చేసిన జిల్లా వాసులతోపాటు ఇతర ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున పాల్గొనుటకు, వీక్షించుటకు వస్తున్నారు. ఏరో స్పోర్ట్సు ఫెస్టివల్‌ను సాహసం చేయరా డింభకా ... కార్యక్రమంగా నిర్వహిస్తున్న సంగతి తెలిసినదే. మొదటి రోజు ఆదివారం 72 రైడ్లు నిర్వహించారు. సాహసం చేయరా డింభకా ... ఫెస్ట్ లో పారా మోటారింగు, హాట్ ఎయిర్ బెలూన్లు,పారా సైలింగు, రిమోట్ కంట్రోల్ ఫ్లైయింగ్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. దేశం నలుమూలల నుండి 15 మంది పైలట్లు ఇందులో భాగస్వామ్యం అయ్యారు. ఐటిడిఏ ద్వారా పార మోటారింగులో శిక్షణ పొందిన ఇద్దరు గిరిజన ఫైలట్లు సైతం ఉండటం విశేషం. ఫ్లైయింగు చేయుటకు ltdaseethampetatourism.com వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్ తోపాటు, వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా నమోదు చేసుకునే అవకాశం కల్పించడం వలన సాహస క్రీడల్లో ఆసక్తిగలవారు పెద్ద ఎత్తున నమోదు చేసుకుంటున్నారు. పర్యాటకులకు, సాహస క్రీడల్లో పాల్గొనే వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు సీతంపేటలో ఏర్పాటు చేసారు. పారా సెయిలింగ్‌లో పాల్గొనుటకు రూ.2 వందలు, హాట్ ఎయిర్ బెలూన్ కు రూ.5 వందలు, పారా మోటారింగుకు వెయ్యి రూపాయలు టికెట్ ధర పెట్టడం జరిగింది. రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కమీషనర్ హనుమంతు అరుణ్ కుమార్, పార్వతీపురం సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి డా.జి.లక్ష్మీశ కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. సాహస క్రీడలు సిమ్లా, మనాలి, ఉత్తరాఖండ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్ లో పలు ప్రాంతాల్లో నిర్వహించే ఈ క్రీడలు సీతంపేట ప్రాంతంలో సాహసం చేయరా డింభకా ... పేరున నిర్వహించడం మంచి పరిణామమని అరుణ్ కుమార్ అన్నారు. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా ఏరో స్పోర్ట్సు ఫెస్టివల్ ను సీతంపేటలో నిర్వహించడం ముదావహ మన్నారు. సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి లోతేటి శివశంకర్ సాహస క్రీడల నిర్వహణకు తీసుకున్న చొరవను ఆయన ప్రశంసించారు. శ్రీకాకుళం జిల్లా ప్రకృతి అందాలకు నిలయమని ఆయన పేర్కొంటూ పర్యాటకంగా ఎంతో భవిష్యత్తు ఉందని అన్నారు. జగతిపల్లి రిసార్ట్సు, సీతంపేటలో గిరిజన మ్యూజియం, ఎకో పార్కు, తిరుమల తిరుపతి దేవస్థానం రూ.3 కోట్లతో నిర్మించే శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రజలకు అందుబాటులోకి రావడం వలన మరింత మంది పర్యాటకులు వస్తారని ఆయన పేర్కొన్నారు. పర్యాటకం అభివృద్ధి చెందడం వలన ఆ ప్రాంతంలో ఉపాధి వస్తుందని, ఆదాయ ఆర్జన కలుగుతుందని ఆయన అన్నారు. ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి శివశంకర్ ఏర్పాట్లను వివరించారు. మన్యంలో పర్యాటక అభివృద్ధికి పెద్దపీట వేసి ఉపాధి మార్గాలు గిరిజనులకు అధికం చేయాలనే ఆశయంతో ఉన్నట్లు చెప్పారు. ఎన్.టి.ఆర్ సాహస ఉద్యానవనం పర్యాటకులను ఆహ్లాదపరుస్తోందన్నారు. ఏరో స్పోర్ట్సు ఫెస్ట్ రెండవ రోజున 80 పార మోటారింగు రైడ్లు, 55 పారా సైలింగు రైడ్లు, 30 హాట్ ఎయిర్ బెలూన్ రైడ్లు జరిగాయని చెప్పారు. ఎన్.టి.ఆర్ సాహస ఉద్యానవనం, ఏరో స్పోర్ట్సు వీక్షించుటకు దాదాపు 6 వేల మంది పర్యాటకులు సందర్శించారని ఆయన వివరించారు.





శబరిమల విషయంలో వారి తీరు ఎలా ఉందంటే..


కాంగ్రెస్, వామపక్ష పార్టీలపై మోదీ తీవ్ర విమర్శలు



తిరువనంతపురం: శబరిమల వివాదంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. కాంగ్రెస్, వామపక్ష పార్టీలపై తీవ్ర విమర్శలు విమర్శలు చేశారు. మంగళవారం కేరళలోని కొల్లంలో పర్యటించిన ఆయన.. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'స్త్రీ, పురుష సమానత్వం, సామాజిక న్యాయం వంటి అంశాలకు గౌరవం ఇవ్వాలంటూ వామపక్ష పార్టీలు, కాంగ్రెస్ పార్టీ పెద్ద పెద్ద మాటలు చెబుతున్నాయి. కానీ వారి చేతలు అందుకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. ముమ్మారు తలాక్‌ను రద్దు చేయాలని ఎన్డీఏ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. కానీ, కమ్యూనిస్టుల పక్షాలు, కాంగ్రెస్ పార్టీ దీన్ని వ్యతిరేకిస్తున్నాయి. శబరిమల విషయంలో ఎల్డీఎఫ్ ప్రవర్తన ఎలా ఉందంటే.. ఏ పార్టీ లేదా ప్రభుత్వం వ్యవహరించిన అతి కించిస్థాయి తీరుగా చరిత్రలో నిలిచిపోయేలా ఉంది. కమ్యూనిస్టులు భారత చరిత్ర, సంస్కృతి, ఆధ్యాత్మికతలను గౌరవించరని మనకు తెలుసు. కానీ, వారికి వీటి పట్ల ఇంతగా ద్వేషం ఉందని ఎవరూ ఊహించలేదు. అలాగే కాంగ్రెస్ పార్టీ శబరిమలపై చాలా రకాలుగా స్పందిస్తోంది. పార్లమెంటులో ఒకలా మాట్లాడుతోంది. శబరిమల ఉన్న జిల్లాలో ఒకలా మాట్లాడుతోంది' అని విమర్శించారు. 'యూడీఎఫ్ (కేరళ ప్రతిపక్ష కూటమి), సీపీఎం ఆధ్వర్యంలోని ఎల్డీఎఫ్ పేర్లు వేర్వేరు. కానీ, కేరళ యువశక్తిని నిర్లక్ష్యం చేయడంలో మాత్రం ఒకేలా వ్యవహరిస్తున్నాయి. అలాగే, పేదల సంక్షేమాన్ని విస్మరించడంలో, కేరళ ప్రజలను మోసం చేయడంలో ఒకేలా వ్యవహరిస్తున్నాయి' అని మోదీ వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని ఆయన చెప్పారు. 'కొన్ని రోజుల క్రితమే కేంద్ర ప్రభుత్వం.. అగ్రవర్ణ పేదలకు 10 శాతం కోటా రిజర్వేషన్లు తీసుకొచ్చింది. కుల, మత, వర్గ భేదాలు లేకుండా దేశంలోని ప్రతి పౌరుడికి అవకాశాలు దక్కాలని మేము భావిస్తాం. సులభతర వాణిజ్య విధానంలో మన దేశ ర్యాంకు మెరుగుపడుతుందని నాలుగేళ్ల క్రితం ఎవరైనా ఊహించారా? 142వ ర్యాంకు నుంచి ఇప్పుడు మనం 77వ ర్యాంకుకి చేరుకున్నాం. సులభతర వాణిజ్య విధానంలో ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఒకటిగా భారత్ నిలిచింది' అని మోదీ అన్నారు.

రాష్ట్రాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారు!

ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు



నారావారిపల్లె: సంక్రాంతి పండుగను సొంతూరులో జరుపుకోవడం ఆనందంగా ఉందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. చిత్తూరు జిల్లా నారావారి పల్లెలోని తిరిదే కల్యాణ మండపంలో చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. "జన్మభూమి కార్యక్రమంలో నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టాం. జన్మభూమిలో ప్రజల భాగస్వామ్యం పెరిగింది. స్మార్ట్, పరిశుభ్ర గ్రామాలుగా తీర్చిదిద్దుతున్నాం. గ్రామాల్లో చెత్త సేకరించి ఎరువుగా మారుస్తున్నాం. సమస్యలను రియల్ టైమ్లో పరిష్కరించగలిగాం. పేదలకు ఆసరాగా నిలబడేందుకు భరోసా కల్పించాం. కేవలం పింఛన్లకే రూ.12వేల కోట్లు ఖర్చువుతోంది. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా వంద యూనిట్ల విద్యుత్ ఇస్తున్నాం. తెలంగాణ లాంటి ధనిక రాష్ట్రాలు చేయలేని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం. వ్యవసాయ, ఉద్యాన పంటల్లో అనంతపురం, చిత్తూరు జిల్లాలు అగ్రస్థానంలో ఉన్నాయి. ఉద్యాన పంటలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. తిరుపతిని ఎడ్యుకేషన్ హబ్, హెల్త్ హబ్గా తీర్చిదిద్దుతాం" అని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధిస్తామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో కంటే ఎక్కువ సంక్షేమ పథకాలు అమలు చేశామని తెలిపారు. రాష్ట్రంలో ఓటు అడిగే హక్కు తెలుగుదేశం పార్టీకి మాత్రమే ఉందన్నారు. "ప్రజలకు మేలు జరగాలని 24 గంటలు కష్టపడ్డాం. దాని ప్రభావం రాబోయే రోజుల్లో చూస్తారు. నరేంద్రమోదీ, కేసీఆర్, జగన్ రాష్ట్రాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారు. అది సాధ్యం కాదు. రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. షర్మిల చేసిన ఆరోపణలు సరికాదు... తీవ్రంగా ఖండిస్తున్నాం. తెదేపా ఎప్పుడూ అలాంటి పనులు చేయదు. ఈ రాష్ట్ర పౌరుడిగా ఇక్కడి పోలీసులకు ఫిర్యాదు చేయాల్సిన బాధ్యత లేదా? హైదరాబాద్లో ఉండి ఆంధ్రప్రదేశ్ పోలీసులపై నమ్మకం లేదంటున్నారు. ఇది కరెక్టు కాదు. ప్రతి వ్యక్తి బాధ్యతగా ఉండాలి. విభజన చట్టంలో హామీలు భాజపా అమలు చేయలేదు. దర్యాప్తు సంస్థలు, వ్యవస్థలను భ్రష్టు పట్టించారు. సీబీఐ, ఈడీ దాడులతో అణచివేయాలని చూశారు. అన్యాయం చేసినప్పుడే తిరుగుబాటు చేశాం. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోలేని పరిస్థితికి వస్తున్నాం" అని చంద్రబాబు అన్నారు.

శబరిమలలోకి వెళ్లిన మహిళపై అత్త దాడి

తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స



తిరువనంతపురం: ఇటీవల శబరిమల ఆలయాన్ని తొలిసారి ఇద్దరు మహిళలు దర్శించుకుని చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే. వారిలో కనకదుర్గ అనే మహిళపై ఆమె అత్తింటివారు దాడి చేసినట్లు తెలుస్తోంది. సంస్కృతి, సంప్రదాయాలను మరచి ఎంత చెప్పినా్న వినకుండా అయ్యప్ప ఆలయాన్ని దర్శించుకునేందుకు వెళ్లి ఆచారాలను మంటగలి పిందంటూ ఆమెపై చేయిచేసుకున్నారు. తీవ్రంగా గాయపడిన దుర్గ ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అయ్యప్ప స్వామిని దర్శించుకున్న అనంతరం దుర్గ ఆందోళనకారులకు భయపడి రెండు వారాలుగా వేరే ప్రాంతంలో తలదాచుకున్నారు. ఈరోజు ఉదయమే తన ఇంటికి చేరుకున్నారు. ఇంటికి వెళ్లగానే ఆమె అత్తగారు చేయిచేసుకున్నారు. ఆమె తలకు తీవ్రగాయమైందని, మరికొన్ని రోజులు ఆమె ఆస్పత్రిలోనే ఉండాలని వైద్యులు సూచించారు. రెండు వారాల క్రితం దుర్గతో పాటు బిందు అమ్మిని అనే 40 ఏళ్ల మహిళ శబరిమలలోకి అడుగుపెట్టి చరిత్ర సృష్టించారు. శబరిమల ఆలయంలోకి 10 నుంచి 50ఏళ్ల మహిళలు ప్రవేశించకుండా దశాబ్దాలుగా ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ గతేడాది సెప్టెంబరు 28న సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెల్లడించింది. అయితే ఈ తీర్పుతో కేరళ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చోటుచేసుకున్నాయి. సుప్రీం తీర్పును వ్యతిరేకిస్తూ కొందరు అయ్యప్ప భక్తులు నిరసనలు చేపట్టారు.

వార్మప్ చేస్తూ యువ క్రికెటర్ మృతి



కోల్కతా : క్రీడా రంగంలో మరో విషాదం చోటుచేసుకుంది. మ్యాచ్ కోసం ప్రాక్టీస్ చేస్తూ గుండెపోటు రావడంతో ఓ యువ క్రికెటర్ ఆకస్మికంగా మృతి చెందాడు. ఈ విషాద ఘటన కోల్కతాలో చోటు చేసుకుంది. స్థానిక పైక్పారా స్పోర్ట్స్ క్లబ్ క్రికెటర్ అనికేత్ శర్మ (21) మంగళవారం ప్రాక్టీస్ చేస్తుండగా అనికేత్ శర్మ ఛాతీలో నొప్పి అంటూ కుప్పకూలిపోయాడు. దీంతో సహచర క్రికెటర్లు దగ్గర్లోని సిటీ ఆసుపత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. గతేడాదే క్లబ్ క్రికెట్లోకి అరంగేట్రం చేసిన అనికేత్ మంచి బ్యాట్స్మన్, బెస్ట్ ఫీల్డర్ అని కోచ్ తెలిపారు. ఇక అనికేత్ మృతిపట్ల క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్ (క్యాబ్) విచారం వ్యక్తం చేసింది. క్యాబ్ సెక్రటరీ అవిషేక్ దాల్మియా మీడియాతో మాట్లాడుతూ జరిగిన ఘటన నిజంగా దురదృష్టకరమన్నారు. అంకిత్ మృతితో రేపు జరగాల్సిన మ్యాచ్ను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి ఘటనలు చోటు చేసు కోవడం చాలా బాధకరమన్నారు. కష్టపడేతత్వం గల క్రికెటర్ని, భవిష్యత్తులో గొప్ప క్రికెటర్ అవుతాడని అందరం భావించాం అన్నారు. అనికేత్ మరణ వార్త విని ఒక్కసారి షాక్కు గురయ్యాయని పైక్పారా స్పోర్ట్స్ క్లబ్ సారథి సంబ్రాన్ బెనర్జీ అన్నారు.

వైఎస్ షర్మిలకు అండగా విజయశాంతి..



హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు విజయశాంతి.. వైఎస్ షర్మిలకు అండగా నిలిచారు. వైఎస్ జగన్ సోదరి షర్మిలపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారంపై విజయశాంతి ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో మహిళల పరిస్థితి ఎంత దయనీయంగా మారిందో అర్థమవుతోందన్నారు. సోషల్ మీడియాను వేదికగా చేసుకుని మహిళా సెలబ్రిటీలపై విషంకక్కే ఈ విష సంస్కృతిని వెంటనే నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. అసలే రాజకీయాల్లో మహిళలను అణగదొక్కుతూ, వారిని వెనక్కు పురుషాధిక్యత చాటుకునే ఘటనలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయని విజయశాంతి మండిపడ్డారు. ఇలాంటి తరుణంలో ఈ తరహా ఘటనలు మహిళలను మానసికంగా కుంగదీస్తాయని ఆమె చెప్పారు. ఈ పరిస్థితిని అధిగమించడం కోసం, పోలీసులు, ప్రభుత్వం వెంటనే స్పందించి చర్య తీసుకునే విధంగా యావత్ మహిళా లోకం సోషల్ మీడియా వేదికగా పోరాటం చేయాలని విజయశాంతి పిలుపునిచ్చారు. ఇది 40 సంవత్సరాల నుంచి సినిమా, రాజకీయాలలో మహిళా సాధికారత కోసం పోరాడిన వ్యక్తిగా తన స్పష్టమైన అభిప్రాయమని ఆమె చెప్పారు. కాగా తనపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేశారని, అటువంటివారిపై చర్యలు తీసుకోవాలని వైఎస్ షర్మిల హైదరాబాద్ సీపీకి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో షర్మిలకు విజయశాంతి మద్దతు తెలిపారు.

హైదరాబాద్‌లో వ్యక్తి దారుణ హత్య

హైదరాబాద్ : నగరంలోని పాత బస్తీలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యారు. ఫూస్నీబజార్ డివిజన్కు చెందిన రవి అలియాస్ పీటర్ రవిని ముగ్గురు దుండగులు నడిరోడ్డుపై నరికి చంపారు. ఈ ఘటన చార్మినార్ పరిధిలోని భగ్యాన్ దేవి ఆసుపత్రి పరిధిలో చోటు చేసుకుంది. మంగళవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో జరిగిన ఈ దారుణ హత్యా దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి. పాతకక్షలే ఈ హత్యకు కారణమై ఉంటుందని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీ సులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

మర్రిపాడులో రోడ్డు ప్రమాదం

నెల్లూరు : మర్రిపాడులో బుధవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. మాంసం తేవడానికి వెళ్లిన వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. వివరాల్లోకెళితే... మర్రిపాడు కదిరి నాయుడు పల్లి గ్రామానికి చెందిన బసిరెడ్డి నాగిరెడ్డి అనే వ్యక్తి బుధవారం (కనుమ) తెల్లవారు జామున మాంసాన్ని తెచ్చేందుకు బద్వేల్ పట్టణానికి వెళుతుండగా.. శ్రీనివాసపురం వద్ద ఉన్న ద్వారకా కన్వెన్షన్ వద్ద తెల్లవారుజాము నాలుగున్నర గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం, నాగిరెడ్డిని ఢీకొంది.

కుమారస్వామి సర్కార్‌కు ఇద్దరు ఇండిపెండెంట్లు షాక్



బెంగళూరు : కర్ణాటకలో హైడ్రామా కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు బీజేపీ సిద్ధమవుతోందన్న ప్రచారం నేపథ్యంలో ముఖ్యమంత్రి హెచ్డీ కుమారస్వామికి ఇద్దరు ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలు తమ మద్దతు ఉపసంహరణ చకున్నారు. స్వతంత్ర ఎమ్మెల్యేలు హెచ్ నగేష్, ఆర్ శంకర్లు జేడీఎస్-కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ మార్పును తాను కోరుకుంటున్న క్రమంలో కుమారస్వామి సర్కార్కు మద్దతు ఉపసంహరించాలనే నిర్ణయం తీసుకున్నాను, మకర సంక్రాంతి రోజున ప్రభుత్వ మార్పును అభిలషిస్తున్నామని ఎమ్మెల్యే శంకర్ పేర్కొన్నారు. కుమారస్వామి నేతృత్వంలోని జేడీఎస్-కాంగ్రెస్ సర్కార్ సుపరిపాలన, నిలకడైన ప్రభుత్వాన్ని అందించడంలో ఘోరంగా విఫలమైందని మరో ఎమ్మెల్యే ఆర్ నగేష్ ఆరోపించారు. సంకీర్ణ భాగస్వామ్య పక్షాల మధ్య ఎలాంటి అవగాహన, సమన్వయం లేదని అన్నారు. సుస్థిర ప్రభుత్వం ఏర్పడే దిశగా తాను బీజేపీతో జట్టుకట్టాలని నిర్ణయం తీసుకున్నానని చెప్పారు. కాగా, స్వతంత్ర ఎమ్మెల్యేలు ఇరువురు మద్దతు ఉపసంహరించినా తమ సర్కార్కు ఎలాంటి ప్రమాదం లేదని కాంగ్రెస్ తేల్చిచెప్పింది. బీజేపీ తమ ఎమ్మెల్యేలను డబ్బు, అధికారం పేరుతో ప్రలోభాలకు గురిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి జీ పరమేశ్వర పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని అస్థిరపరచాలన్న బీజేపీ ప్రయత్నాలు ఫలించబోవన్నారు. కాగా బీజేపీ ఇప్పటికే తమ ఎమ్మెల్యేలను గురుగ్రామ్ రిసార్ట్కు తరలించిన సంగతి తెలిసిందే. సంక్రాంతి తర్వాత కర్ణాటకలో ప్రభుత్వ ఏర్పాటు దిశగా బీజేపీ ఆపరేషన్ లోటస్ పేరుతో వేగంగా పావులు కదుపుతోంది. కుమారస్వామి సర్కార్పై అవిశ్వాస తీర్మానానికి బీజేపీ సన్నాహాలు చేస్తోందని ఆ పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

ఈ ఉద్యోగులకూ వేతన పెంపు ప్రయోజనాలు



న్యూఢిల్లీ : ఏడవ వేతన సంఘం ప్రయోజనాలను ఉపాధ్యాయులు, రాష్ట్ర ప్రభుత్వ అకడమిక్ స్టాఫ్, ప్రభుత్వ ఎయిడెడ్ సాంకేతిక విద్యాసంస్థల ఉద్యోగులకూ వర్తింపచేయాలనే ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. ఈ నిర్ణయంతో కేంద్ర ప్రభుత్వంపై రూ 1241.78 కోట్ల అదనపు భారం పడనుంది. ఏడవ వేతన సంఘం సిఫార్సులకు అనుగుణంగా పెరిగిన వేతన బకాయిలను ఆయా సంస్థలకు కేంద్రం రీఎంబర్స్ చేయనుంది. మరోవైపు ఫిబ్రవరి 1న మోదీ సర్కార్ ప్రవేశపెట్టనున్న తాత్కాలిక బడ్జెట్లో వేతన పెంపుపై 50 లక్షల మందికి పైగా ఉద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఎన్నికల ఏడాది కావడంతో వేతన పెంపు దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కనీస వేతనం రూ 18,000ను రూ 26,000కు పెంచాలని ఉద్యోగ సంఘాలు దీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్నాయి. ఫిట్మెంట్ను సైతం ప్రస్తుతమున్న 2.57 రెట్ల నుంచి 3.68 రెట్లకు పెంచాలని పట్టుబడుతున్నాయి.

పండుగ పూట విషాదం.. విద్యుత్ షాక్ తగిలి బాలిక మృతి



సత్తుపల్లి(ఖమ్మం): సంక్రాంతి పండుగ ఓ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. కుటుంబ సమేతంగా సంక్రాంతి పండగను సరదాగా జరుపుకోవాల్సిన ఆ ఇంట అనుకోని రీతిలో విషాదం చోటుచేసుకుంది. విద్యుత్ రూపంలో ఓ బాలికను మృత్యువు కాటువేసింది. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... సత్తుపల్లి మండలం రామానగరానికి చెందిన నీలాల రమణమ్మ, రాధ దంపతులకు ఇద్దరు కుమారులు, అందులో ఓ కుమార్తె సుకన్య(16) ఉన్నారు. కాగా... సంకాంత్రి పండగ సందర్భంగా మృతురాలి తల్లి రాధ నల్లమట్టితో ఇల్లు అలికి త్వరగా ఆరేందుకని టేబుల్ ఫ్యాన్ వేసి దుకాణానికి వెళ్లింది. అయితే బాజు పట్టిన టేబుల్ను దులిపేందుకు సుకన్య ఫ్యానును పక్కకు తీసే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్తు ప్రసారమై అక్కడికక్కడే దుర్మరణం చెందింది. సుకన్య దమ్మపేట మండలంలోని నాచారంలో పదో తరగతి చదువుతోంది. సంక్రాంతి పండుగ రోజు ఇలాంటి సంఘటన చోటుచేసుకోవడంతో ఆ గ్రామం విషాదంలో మునిగింది.

హార్దిక్ పాండ్యాకు మరో షాక్



ముంబై : మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన వివాదాలపాలైన టీమిండియా ఆల్రౌండర్ హార్దిక్ పాండ్యాకు మరో షాక్ తగిలింది. ముంబైలో ప్రతిష్ఠాత్మక క్లబ్ అయిన 'ఖర్ జింఖానా'లో గౌరవ సభ్యత్వాన్ని కోల్పోయాడు. సోమవారం జరిగిన మేనేజింగ్ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఖర్ జింఖానా సంయుక్త కార్యదర్శి గౌరవ్ కపాడియా వెల్లడించారు. హార్దిక్ పాండ్యా సభ్యత్వాన్ని రద్దు చేసినట్లు స్పష్టం చేశారు. 'కాఫీ విత్ కరణ్' టీవీ షోలో మహిళలపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడంతో కేఎల్ రాహుల్తో పాటు హార్దిక్ పాండ్యా వివాదాల్లో చిక్కుకున్నారు. క్రమశిక్షణా చర్యల్లో భాగంగా వీరిపై బీసీసీఐ నిరవధిక సస్పెన్షన్ విధించింది. వివాదాస్పద వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని బీసీసీఐ షోకాజ్ నోటీసులు జారీ చేయగా.. పాండ్యా, రాహుల్ బేషరతుగా క్షమాపణ చెప్పారు.

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ఎన్నికకు షెడ్యూల్ ప్రకటన

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు గురువారం నుంచి ప్రారం భం కానున్నాయి. ఈ సమావేశాలు ఈనెల 20వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో రేపు (గురువారం) స్పీకర్ ఎన్నికకు షెడ్యూల్ ప్రకటన వెలువడ నుంది. ఎల్లుండి (శుక్రవారం) స్పీకర్ ఎన్నిక జరగనుంది. కాగా తెలంగాణ శాసనసభ ప్రొటెం స్పీకర్గా మజ్లిస్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్ బుధవారం సాయంత్రం 5 గంటలకు రాజ్భవన్లో ప్రమాణస్వీకారం చేయనున్నారు. గవర్నర్ నరసింహన్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్తో ప్రమాణం చేయిస్తారు.

బ్రిటన్ ప్రధానికి గట్టి ఎదురుదెబ్బ



లండన్: బ్రిటన్ ప్రధాని థెరిసా మే‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. యూరోపియన్ యూనియన్(ఈయూ) నుంచి బయటకు రావాలని బ్రిటన్ నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈయూతో కుదుర్చుకున్న ఒప్పందంపై థెరిసా మే ప్రవేశపెట్టిన బ్రెగ్జిట్ బిల్లును బ్రిటన్ పార్లమెంట్ తిరస్కరించింది. బుధవారం జరిగిన ఓటింగ్లో బిల్లుకు వ్యతిరేకంగా 432 మంది సభ్యులు ఓటేయగా, అనుకూలంగా 202 మంది ఎంపీలు ఓటేశారు. దీంతో 230 ఓట్ల తేడాతో బ్రెగ్జిట్ ఒప్పందాన్ని బ్రిటన్ ఎంపీలు తిరస్కరిం చారు. ఒప్పందంపై భారత సంతతికి చెందిన ఏడుగురు బ్రిటన్ ఎంపీలు కూడా బ్రెగ్జిట్కు వ్యతిరేకంగా ఓటేశారు. బ్రెగ్జిట్ థెరిసా మే చేసిన అభ్యర్థనను ఎంపీలెవరూ పట్టించు కోలేదు. బిల్లు వీగిపోవడంతో ప్రతిపక్ష లేబర్ పార్టీ థెరిసా ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టింది. ఒకవేళ తీర్మానం ఆమోదం పొంది ప్రభుత్వం రాజీనామా చేసినట్లయితే బ్రిటన్లో ఎన్నికలు అనివార్యం కానున్నాయి. బ్రెగ్జిట్ కోసం యూరోపియన్ యూనియన్ (ఈయూతో బ్రిటన్ కుదుర్చుకున్న ఒప్పందాన్ని పార్లమెంట్ నేతలు ఇదివరకే ఆమోదించిన విషయం తెలిసిందే. అయితే బిల్లుపై బ్రెగ్జిట్కు బ్రిటన్ పార్లమెంట్ ఆమోదం లభించడం అంత సులభమైన విషయం కాదు. ప్రధాని థెరిసా మే కుదుర్చుకున్న ఒప్పందం బ్రిటన్కు నష్టం చేకూర్చేలా ఉందంటూ ఆమె సొంత మంత్రివర్గంలోని వ్యక్తులే రాజీనామా చేసి వెళ్లిపోవడం, సొంత పార్టీ ఎంపీలే మేపై అవిశ్వాస నోటీసులు ఇవ్వడం తెలిసిందే. ఇది బ్రిటన్కు ఎంతో మేలు చేసే ఒప్పందమేననీ, ఇంతకన్నా మంచి ఒప్పందాన్ని ఎవరూ కుదర్చలేరనీ ఆమె వాదిస్తున్నప్పటికీ చాలా మంది ఆమెకు వ్యతిరేకంగానే ఉన్నారు. పార్లమెంట్లో బిల్లు వీగిపోవడంతో రానున్న కాలంలో అస్థిరకర పరిణామాలు చోటుచేసు కోబోతున్నాయి. పార్లమెంట్ ఆమోదం లేకుండా బయటకు రావల్సి రావచ్చు లేదా, కొత్త ఒప్పందం కోసం థెరిసా మరోసారి చర్చలు కూడా ప్రారంభించే అవకాశం ఉంది. ఇది లావుండగా మే ప్రభుత్వం పడిపోయి ఎన్నికలు కూడా జరగొచ్చని ప్రతిపక్ష లేబర్పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు.

ముస్లిమ్ కోటాపై మాయావతి సంచలన ప్రకటన



లక్నో : బహుజన సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి ముస్లిమ్ కోటాపై సంచలన ప్రకటన చేశారు. ఆర్థికంగా వెనుకబడిన ముస్లింలకు విద్యా, ఉద్యోగాల్లో ప్రత్యేకంగా రిజర్వేషన్ కోటా కల్పించాలని మాయావతి డిమాండ్ చేశారు. 1947లో ప్రభుత్వ ఉద్యోగాల్లో 33 శాతం మంది ఉండేవారని, కాని నేడు ప్రభుత్వ ఉద్యోగాల్లో వారి శాతం 2 నుంచి 3 శాతానికి తగ్గిందన్నారు. ఇటీవల ఈబీసీలకు కేంద్రం ప్రకటించిన పదిశాతం రిజర్వేషన్ వల్ల ముస్లింలకు ఎలాంటి లాభం చేకూరదని మాయావతి చెప్పారు. 63వ జన్మదినోత్సవం జరుపుకున్న మాయావతి మాట్లాడుతూ, బీఎస్పీ, ఎస్పీ కార్యకర్తలు కలసికట్టుగా పనిచేసి లోక్సభ ఎన్నికల్లో విజయం సాధించి తనకు జన్మదిన బహుమతిగా అందజేయాలన్నారు. యూపీ ఢిల్లీలో తదుపరి ప్రధాని ఎవరనేది నిర్ణయిస్తుందని మాయా వతి పేర్కొన్నారు. బీజేపీ, ఆరెస్సెస్ లు మతాన్ని రాజకీయం చేస్తూ ముస్లింలు సమాజ్ కూడా చేయ కుండా ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తుందని మాయావతి ఆరోపించారు.

ప్రముఖ సినీ కమెడియన్ బ్రహ్మానందానికి బైపాస్ సర్జరీ



ముంబై : దాదాపు వెయ్యి సిని మాలలో నటించి తెలుగు ప్రేక్షకుల ను అలరించిన ప్రముఖ సినీ కమెడియన్ కన్నెగంటి బ్రహ్మానందం (62) కు గత గుండెపోటు వచ్చిన ఆయనలో ఆ స్వంగా వెలుగు చూసింది. గత ఆదివారం బ్రహ్మానందం ముంబైలో ఉండగా, గుండెపోటు వచ్చి పరిస్థితి విషమించడంతో.. వెంటనే ఆయన్ను ఆసియన్ హార్ట్ ఇన్స్టిట్యూట్ కు తరలించారు. పలు పరీక్షలు చేసిన ప్రముఖ హార్ట్ సర్జన్ రమాకాంత పాండా, బ్రహ్మానం దానికి బైపాస్ చేయాలని నిర్ణయించడం తో..వెంటనే ఆయనకు బైపాస్ సర్జరీ చేశారు. ఆపరేషన్ సమయంలో ఆయన కుమారులు రాజా గౌతమ్, సిద్ధార్థ్ లు అక్కడే ఉన్నారు. ప్రస్తుతం బ్రహ్మానందం పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.



కమనీయం గోదా కల్యాణం



విశాఖపట్నం, న్యూస్‌లీడర్: భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం శ్రీ వరాహలక్ష్మి నృసింహ స్వామి దేవస్థానానికి చెందిన కొండ దిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణ మహోత్సావాన్ని కనులారా తిలకించి భక్తి పారవశ్యంలో మునిగి తేలారు. ఈ ఉత్సావాన్ని అర్చకులు శాస్త్రోకంగా నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తిని శ్రీరంగనాథుడిని అలంకరించారు. గోదాదేవిని పెళ్లికూతురుగా ముస్తాబు చేశారు. శ్రీదేవి, భూదేవి ఉత్సవ మూర్తులకు విశేష పుష్పాలంకరణ చేశారు. వేద మంత్రాలు, మేళతాళాలు మధ్య ఆలయంలోంచి ఉత్సవమూర్తులను తీసుకొచ్చి వేదికపై ఆశీనింపజేశారు. కల్యాణ మహోత్సావాన్ని ఘనంగా జరిపారు. భక్తులకు స్వామి ఆశీస్సులు, అక్షింతలు అందజేశారు.

అల్లిపురంలో...

వజ్ర కిరీటధారిగా బలిగిరి ప్రసన్న వెంకటేశ్వర స్వామి

అత్యంత వైభోవపేతంగా అల్లిపురం వెంకటే శ్వరస్వామీ మెట్ట దేవాదాయ ధర్మాదాయ శాఖ శ్రీ బలిగిరి ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో కొలువుదీరిన గోదాదేవి రంగ నాయకుల కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. తెల్లవారు నుండి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు శ్రీపాంచరాత్ర ఆగమ సాంప్రదాయాలతో కళ్యాణోత్సవం సంబందించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే వెంకటేశ్వరస్వామికి విశేష, పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఆలయ ప్రాంగ్రణంలో గోదాదేవీ రంగ నాయకుల కల్యాణోత్సవ శోభ రమనీయంగా సాగింది. పూజవిధానంలో భక్తులు పాల్గొని తరించారు. ఉత్సవ మూర్తులను అలంకరించారు. ఆలయంలో పల్లికిలో తీసుకొచ్చి కన్నులపండువుగా జరిగిన కళ్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తరించారు. పూజలో పాల్గొన భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారిని కె.శిరీష, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సిటీ ఖాళీ..!

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : విశాఖ నగర రోడ్లన్నీ బోసిపోతూ కనిపించాయి. జంక్షన్లు ఖాళీగా దర్శనమిచ్చాయి. ఈ సంక్రాంతి నగరాన్ని చాలా వరకు ఖాళీ చేసింది. లక్షలాది జనం ఊరెళ్లిపోవడంతో నగరం కర్ఫ్యూను తలపించింది. నిత్యం ఏ రోడ్డు చూసిన వేల సంఖ్యలో వాహనాలతో కిక్కిరిసిపోయేది, ట్రాఫిక్ జామ్‌లతో వాహనాల హారన్ల రోదన వినిపించేది. అలాంటి పరిస్థితిని తరచూ చవిచూసే నగరవాసీ బుధవారం నాటి నగర పరిస్థితి చూస్తే ఒక్కసారిగా బోసిపోయింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి పొట్ట కూటి కోసం పట్టణానికి





వలసలు వచ్చి స్థానికంగా వున్న వారంతా వారివారి ప్రాంతాలకు తరలి వెళ్లడంతో గ్రేటర్ విశాఖ వెలవెలబోయింది. పట్టణం నిర్మానుష్యంగా మారింది.

బీచ్ కళకళ... సందడే సందడి..

సిటీలో వున్న వారంతా అందాల సాగరతీరంలో వాలిపోయారు. కుటుంబ సమేతంగా అందరూ కలిసి బీచ్‌లో సందడిగా గడిపారు. ఆకాశమే హద్దుగా గడిపారు. పర్యాటక ప్రాంతాల్లో విహరించారు. బీచ్‌లో చాలా సమమం గడిపి, ఈత కొడుతూ మైమరిచిపోయారు.

బీచ్ రోడ్డు గాలిపటాల ఉత్సవంతో నిండిపోయింది. మబ్బులను తాకుతూ ఎగిరిన పతంగులు ఆకాశంలో నక్షత్రాలను గుర్తు చేశాయి. చిన్న, పెద్ద, యువత పతంగులు ఉత్సాహంగా ఎగరు వేశారు. పతంగులతో సముద్రానికి కొత్త అందాన్ని తీసుకువచ్చారు.

ఆత్మీయ అనుబంధాల సంక్రాంతి

బంధుమిత్రుల సందడి

ఆటలపోటీలతో వెల్లువిరిసిన పండగ శోభ

ఆకర్షణగా హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి పండుగను ఆనందోత్సాహాలు మధ్య జరుపుకున్నారు. తెలుగు సంస్కృతీ, సంప్రదాయాలు ప్రతిబింబించేలా సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకాయి. ముగ్గులు వేసి, గొబ్బిళ్ళు పెట్టి భోగి మంటలు వెలిగించి పండగ విశేషంగా జరుపుకున్నారు. హరిదాసులు కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలాచాయి. చిన్నారులు పతంగులు ఎగరువేస్తూ సందడిగా గడిపారు. రంగవల్లులు, హరిదాసులు, గంగిరెద్దులు, పిండి వంటలు, బంధుమిత్రుల సందడితో నగరమంతా కళకళలాడింది. ఇంటిల్లపాది నూతన వస్త్రాలతో సందడి చేశారు. వివిధ రకాల ఆటల పోటీలతో



పండగ శోభ వెల్లివిరిసింది. మకర సంక్రాంతిని పురస్కరించుకొని మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం పితృదేవతలకు తర్పణం వదలడం, తమ నివాసాల్లో వారికి దుస్తులు పెట్టుకుని పూజించారు. పిండివంటలు సమర్పించి వారిని స్మరిం చుకుని జ్ఞాపకాలను నెమరెసుకున్నారు. సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా నగరంలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. పేద, ధనిక తేడా లేకుండా ప్రతి ఒక్కరు తమ శక్తి మేర పండగను ఘనంగా చేసుకున్నారు.







విశాల్ పెళ్లాడే సివంగి పిల్

హీరో విశాల్ పెళ్లాడే సివంగి పిల్ల ఎవరో తెలుసా? ఎప్పుడైనా చూశారా? ప్రస్తుతం సౌత్ ఇండస్ట్రీస్ లో అగ్రపథంలో దూసుకుపోతున్న విశాల్ హైదరాబాదీ అమ్మాయిని పెళ్లాతున్నాడని వార్తలొచ్చాయి. కానీ ఆ



సివంగి పిల్ల ఎవరో మాత్రం ఇంతవరకూ ఫోటోలు బయటకు రాలేదు. తాజాగా విశాల్ తనతో పాటు సివంగి పిల్ల ఫోటోని షేర్ చేశాడు. ప్రస్తుతం ఆ ఫోటో వెబ్ లో జోరుగా వైరల్ అయిపోతోంది. ఇంతకీ ఎవరా సివంగి పిల్ల? అంటే హైదరాబాద్ కు చెందిన బిజినెస్ ఫ్యామిలీ విజయ్ రెడ్డి- పద్మజల తనయ అనీషా రెడ్డి. సివంగి పిల్ల సివంగి పిల్ల! అంటూ పందెంకోడి 2లో కీర్తి సురేష్ వెంట పడ్డాడు. కానీ ఇకపై అనీషా వెంట తప్ప ఇంకెవరి వెంటా పడే ఛాన్సే లేదు. విశాల్ ఇదివరకూ తన చిన్ననాటి స్నేహితురాలు - తన రైవల్ మామ శరత్ కుమార్ కుమార్తె వరలక్ష్మి తో ఎఫైర్ సాగించాడని వార్తలొచ్చాయి. కానీ ఆ ఇద్దరూ ఆ తర్వాత మేం కేవలం స్నేహితులం మాత్రమే.. ప్రేమా గీమా జాన్తా నయ్! అంటూ ఆ ప్రచారాన్ని కొట్టిపారేశారు. అంతేకాదు విశాల్ సినిమాల్లో విలన్ వేషాలతోనూ వరలక్ష్మి అదరగొట్టేసింది.

పందెంకోడి 2 తర్వాత ప్రస్తుతం టెంపర్ రీమేక్ అయోగి పైనే విశాల్ దృష్టి పెట్టాడు. ఓవైపు ఈ చిత్రాన్ని పూర్తి చేసే క్రమంలోనే త్వరలో నిశ్చితార్థం జరగనుందన్న వార్తలు వస్తున్నాయి. 2019 ఆగస్టులో విశాల్-అనీషా జంట వివాహం ఉంటుందని చెబుతున్నారు. మొత్తానికి నడిగర సంఘం - నిర్మాతల మండలి భవంతి నిర్మాణం పూర్తి చేసి పెళ్లి చేసుకుంటానన్న విశాల్ ఆ మాట నిలబెట్టుకుంటున్నాడో లేదో కాస్త వేచి చూడాలి. ఇక ఈ వారంలోనే ఇరు బంధువుల తరపున నిశ్చితార్థానికి సంబంధించిన ప్రకటన వెలువడనుందని తెలుస్తోంది.

'సైరా'లో విజయ్ సేతుపతి లుక్

హైదరాబాద్ : మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'సైరా నరసింహారెడ్డి'. సురేందర్ రెడ్డి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. కాగా.. ఇందులో కీలక పాత్రలో నటిస్తున్న ప్రముఖ తమిళ నటుడు విజయ్ సేతుపతి లుక్‌ను చిత్రబృందం ఈరోజు విడుదల చేసింది. ఇందులో విజయ్ రాజా పాండి అనే పాత్రలో నటిస్తున్నారు. ఈరోజు విజయ్ పుట్టినరోజును పురస్కరించుకుని చిత్రబృందం మోషన్ టీజర్‌ను విడుదల చేసింది. ఇందులో వీరుడిలా కనిపిస్తున్న విజయ్ సేతుపతి లుక్ ఆకట్టుకుంటోంది. కొణిదెల ప్రొడక్షన్ కంపెనీ బ్యానర్‌పై రామ్‌చరణ్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. అలనాటి స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితాధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.

ఇందులో నయనతార.. నరసింహారెడ్డి భార్య సిద్ధమ్మ పాత్రలో నటిస్తున్నారు. బాలీ వుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ నరసింహారెడ్డికి గురువుగా కీలక పాత్ర పోషిస్తున్నారు. జగపతిబాబు, సుదీప్, తమన్నా తదితరులు ముఖ్య భూమి కలు పోషిస్తున్నారు. సినిమాను ఆగస్ట్ 15న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.



నిరుపేదలకు చేయూత

దుప్పట్లు, తువ్వాళ్ళు పంపిణీ

శ్రీకాకుళం : నిరుపేదలకు చేయుత నివ్వడంలో పొందే ఆనందం వేలకట్టలేనిదని, అందుకే మనకు అవకాశ మున్నంత వరకూ నలుగురికి సహాయం చేయాలని శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల విశ్రాంత ఉపాధ్యాయులు బెవర ముకుందరావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం సంతకవిటి మండలం, పొదలి గ్రామంలో జరిగిన సంక్రాంతి సంబరాల సందర్భంగా అరవై మంది నిరుపేదలకు దుపట్లు, తువాళ్ళు, బనియన్లను పంపిణీ చేశారు. స్టీల్ ప్లాంట్ విశ్రాంతి అధికారి బెవర లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తమ పూర్వీకులు న్యాయ బద్ధం, క్రమశిక్షణయుత జీవితనాన్ని తమకు అందించారన్నారు. ఆ పరం పరను భవిష్యత్ తరాలవారికి అందజేయడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. బెవర వెంకట రమణ మూర్తి, బెవర నరసింగ రావు, బెవర కృష్ణ కుమార్, పిళ్ళా శ్రీనివాసు, బెవర ప్రసాద్, బెవర వెంకట రవి శంకర్, బెవర దుర్గాప్రసాద్, బెవర శేఖర్, బెవర యుగంధర్, గోవింద్ తదితరులు కూడా ఈ వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.





నన్ను అడగలేదు

రకుల్ ప్రీత్ సింగ్ ఈమధ్య తెలుగు సినిమాల్లో పెద్దగా కనిపించడం లేదుగానీ తన ఫోకస్ అంతా తమిళ.. హిందీ భాషలపై పెట్టింది. ఎన్టీఆర్ బయోపిక్ లో శ్రీదేవి పాత్రలో కనిపించినా.. ఆ క్యామియో వల్ల రకుల్ కు కొత్తగా వచ్చిందేమీ లేదు. ఇది కాకుండా ఒక్క స్ట్రెయిట్ తెలుగు సినిమాలో కూడా రకుల్ నటించడం లేదు.

ఇదిలా ఉంటే ఈ మధ్య రకుల్ కు సంబంధించిన ఒక వార్త హల్చల్ చేసింది. 'కేజీఎఫ్' లో రకుల్ కు ఐటెమ్ సాంగ్ చేసే అవకాశం వచ్చినా రిజెక్ట్ చేసిందని అన్నారు. రకుల్ నో చెప్తేనే ఆ ఐటెమ్ నెంబర్ మిల్కీ బ్యూటీ తమన్నాకు వెళ్ళిందట. తమన్నా మాత్రం నో చెప్పకుండా ఎస్ అని చెప్పేసింది. ఇదే విషయంపై అమ్మడిని ఆరా తీస్తే రకుల్ అదో రూమర్ అని కొట్టిపారేసింది. అంతటితో ఆగకుండా తనకు 'కేజీఎఫ్' లో ఐటెం సాంగ్ చేసే అవకాశం రాలేదని.. ఒకవేళ అవకాశం వస్తే ఎందుకు వద్దంటానని చెప్పుకొచ్చింది. అయినా ఐటమ్ సాంగ్స్ లో నటిస్తే తప్పేముందని ప్రశ్నించింది.

నిజమే.. ఈ తరం హీరోయిన్లలో చాలమంది ఐటమ్ సాంగ్స్ లో నటించేందుకు వెనకడుగు వేయడం లేదు. పైగా రెండు మూడు రోజుల కాల్ షీట్స్ తోనే భారీగా డబ్బు ముడుతుంటే ఎవరైనా ఎందుకు వద్దంటారు లెండి. పైగా సాంగ్ హిట్ అయితే అదోరకమైన క్రేజు.. డబ్బెవరికి చేదు.. క్రేజ్ ఎవరికి వద్దు?



వింక్ గర్ల్ సినిమాకు లీగల్ నోటీసులు

సోషల్ మీడియా సెన్సేషన్ ప్రియా వారియర్ కొత్త సినిమా 'శ్రీదేవి బంగాళా' టీజర్ ఈమధ్యే రిలీజ్ అయింది. ప్రశాంత్ మాంబుల్లి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ థ్రిల్లర్ టీజర్ ఇంట్రెస్టింగ్ గా ఉంది కానీ టీజర్లో సీన్లు అతిలోక సుందరి శ్రీదేవి జీవితాన్ని పోలి ఉండడం తో వివాదాస్పదం అయ్యాయి.

టీజర్లలో ప్రియా వారియర్ పాత్రను ఫిలిం స్టార్ శ్రీదేవిగా చూపించారు. ఒంటరితనంతో బాధపడే సూపర్ స్టార్ శ్రీదేవిగా ప్రియా నటించింది. కాకపోతే టైటిల్ లో శ్రీదేవి పేరు ఉండడం..పైగా టీజర్ చివర్లో బాత్ టబ్ లో పడిపోయి ప్రియా చనిపోయినట్టుగా చూపించడంతో ఇది నిజం శ్రీదేవి జీవితాన్ని పోలి ఉందని.. పబ్లిసిటీ కోసం ఇలా చేశారని విమర్శలు వస్తున్నాయి. మరోవైపు ఈ సినిమా టీజర్ ను చూసి అప్సెట్ అయిన బోనీ కపూర్ 'శ్రీదేవి బంగాళా' టీమ్ కు లీగల్ నోటీసులు పంపించారు. 'శ్రీదేవి బంగళా' దర్శకుడు ప్రశాంత్ ఈ విషయంపై స్పందిస్తూ లీగల్ నోటీసులను అందుకున్న విషయం నిజమేనని ధృవీకరించాడు. లీగల్ గా దానికి సమాధానం ఇస్తామని ప్రకటించాడు. శ్రీదేవి అనేది ఒక కామన్





పేరు అని.. తమ సినిమాలో హీరోయిన్ పేరు శ్రీదేవి అని చెప్పుకొచ్చాడు. ప్రియా వారియర్ ఈ 'శ్రీదేవి బంగాళా' సినిమాతోనే బాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది. మరి ఈ వివాదాలు ఈ సినిమాకు ఏ విధంగా హెల్ప్ అవుతాయో వేచి చూడాలి. ఇదిలా ఉంటే ప్రియా వారియర్ నటించిన డెబ్యూ ఫిలిం 'ఒరు ఆదార్ లవ్' సినిమా ఫిబ్రవరి 14 న రిలీజ్ కానుంది. ఈ సినిమాను తెలుగులో 'లవర్స్ డే' టైటిల్ తో విడుదల చేస్తున్నారు. మరి ఆలోపు ఈ 'శ్రీదేవి బంగాళా' ఎందుకు వివాదాస్పదం అయిందో టీజర్ చూసి మీరే తేల్చండి.

Printed, Published and Owned by V.V.Ramana Murthy and Printed at LEADER PRESS, 58-14-109/5, Block No. 113 A, VUDA Layout, Marripalem, Visakhapatnam - 530009, A.P. and Published at 47-10-7/3, Diamond Park Junction, Visakhapatnam - 530016, A.P.
EDITOR - V.V. RAMANA MURTHY, **RNI NO: 72163/99, Registered Postal Regd. No. - VSP/211/2015-17 E-MAIL andhraleader@gmail.com, Telephone Nos. 0891-6660909, 93485 50909**